ప్రజాశక్తి
గురువారం 10 ఆగస్టు 2023 8 పేజీలు

ప్రకాశం బాపట్ల

మాట్లాడుతున్న చుండూరి రంగారావు

కార్పొరేట్ శక్తులను తరిమికొట్టండి

- బిజెపిని ఓడించటమే లక్ష్యంగా పనిచేయాలి
- ఎస్‌కెఎం జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు పిలుపు
- క్విట్ ఇండియా ధర్నా విజయవంతం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

క్విట్‌ఇండియా ఉద్యమ స్ఫూర్తితో దేశంలోని సంపదను కొల్లగొడుతున్న కార్పొరేట్ శక్తులను దేశం నుండి తరిమికొట్టాలని వారికి అన్ని విధాలా సహకరిస్తున్న బిజెపి ప్రభుత్వానికి చరమగీతం పాడాలని సంయుక్త కిసాన్ మోర్చా ప్రకాశం జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు పిలుపునిచ్చారు. సంయుక్త కిసాన్ మోర్చా రాష్ట్ర సమితి ఆదేశాల మేరకు ఒంగోలు కలెక్టరేట్ వద్ద సంయుక్త కిసాన్ మోర్చా ప్రకాశం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మోడీ కో హటావో దేశ్ కో బచావో, క్విట్ కార్పోరేట్, క్విట్ అగ్రికల్చర్ అనే నినాదంతో బుధవారం ధర్నా నిర్వహించారు. ధర్నా కార్యక్రమానికి అధ్యక్షత వహించిన చుండూరి రంగారావు మాట్లాడుతూ నాడు స్వాతంత్రం కోసం క్విట్ ఇండియా ఉద్యమంతో దేశం నుండి బ్రిటీష్ వారిని తరిమివేశారన్నారు. నేడు తెల్లదొరలను మించి బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు దేశ సంపదలను దోచి పెడుతోందన్నారు. అందులో భాగంగానే విశాఖ ఉక్కు పరిశ్రమలు ▶ 2లో

ప్రభుత్వ భూమికి పరిహారమా.?

- వాగు పోరంబోకు భూమికి పట్టా..
- రూ.2.72 కోట్ల ప్రభుత్వ నిధులకు ఎసరు.!

▶ 2లో

బాలినేని రాజకీయ మౌనం

- జిల్లా పెత్తనంపై తేల్చని అధిష్టానం
- రాజకీయాల్లో ఆయన భవితవ్యంపైనే చర్చలు

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

సీనియర్ నేత బాలినేని రాజకీయంగా సందిగ్ధంలోనే ఉన్నారనే చర్చ జోరుగా సాగుతోంది. ఇప్పుడు చర్చలన్నీ ఆయనపైనే నడుస్తున్నాయి. ఏ ఒక్కటీ నిర్ధారణ లేకపోయినా ఇప్పుడు రాజకీయవర్గాల్లో మాత్రం బాలినేని భవితవ్యంపైనే ఎక్కడ చూసినా పలు రకా లుగా చర్చలు నడుస్తున్నాయి. ఊహాగానాలూ పెరిగాయి. బాలినేని ఎందుకు మౌనంగా ఉన్నారు? ఆయన జిల్లా రాజకీయాల్లో కొంత కాలంగా అంటీఅంటనట్లుగా ఎందుకు ఉంటున్నారు? అధిష్టానం ఆయనకు ప్రాధాన్యత ఇస్తుందా? లేదా? అనే కోణంలో చర్చలైతే సాగుతున్నాయి.

తెలుగుదేశం నేత లోకేష్ ఒంగోలు పర్యటన తర్వాత కొత్త కొత్త ప్రచారాలు కూడా తెరపైకి వచ్చాయి. బాలినేనిపై లోకేష్ విమర్శలు చేయకపోవడం కూడా గుసగుసలకు ఎజండాగా దొరికింది. కొందరు ఆయన పార్టీ మారుతున్నారనే ప్రచారాన్ని కూడా వేగిరం చేశారు. అయితే ఈ చర్చలు సాగడానికి బాలినేని మౌనం కూడా కారణంగా చెబుతున్నారు. ఆయన తనదైన శైలిలోనే అన్నిటికీ మౌనం దాల్చడం ఊహాగానాలకు మరింత ఊతం చేకూర్చినట్లవుతోంది. ఫలితంగా పార్టీ శ్రేణుల్లోనూ కొంత అయోమయం నెలకొంది. ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జిలు కూడా జరిగే పరిణామాలపై ఆసక్తిగానే దృష్టి సారించారు. అధిష్టానంతో అసంతృప్తిలో ఉన్నట్లు అందరికీ అర్థమైంది. భవిష్యత్‌లో ఏ నిర్ణయం తీసుకోనున్నారనేదీ స్పష్టత లేక అందరిలోనూ కొంత గందరగోళమే కొనసాగుతోంది. అయితే బాలినేని లోతుగా ఆలోచించే అన్ని నిర్ణయాలు తీసుకుంటారని ఆయన సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి. ఆయనపై అన్నీ ప్రచారాలే సాగుతున్నాయంటున్నారు. పార్టీలు మారాల్సిన అవసరం లేదని సన్నిహితులు మాత్రం గట్టిగానే స్పష్టం చేస్తున్నారు. అయితే ఈ అనిశ్చితికి కారణం ఆయనకు, అధిష్టానానికి మధ్య వచ్చిన విభేదాలే.. అందులో ఎలాంటి సందేహం లేదు. ఆయన ఇప్పటికీ జిల్లా పెత్తనంపైనే పట్టుబడుతున్నారు. కోఆర్డినేటర్‌గా బాధ్యతల నుంచి కొన్ని కారణాలతో తప్పుకున్నాక.. జిల్లాలో పూర్తిస్థాయిలో పార్టీ పగ్గాలు ఇవ్వాలని కోరారు. దానికి ఇప్పటికీ సానుకూలత రాలేదు. అందుకు కారణం సిఎం జగన్ వద్ద బాలినేనికి వ్యతిరేకంగా ఆయన బంధు వులేనని ఆయన గట్టిగా భావిస్తున్నారు. గతంలో బాలినేని హఠాత్తుగా మీడియా సమావేశం ఏర్పాటు చేసి అధిష్టానంలో కొందరు తనకు వ్యతిరేకంగా పనిచేస్తున్నా రంటూ ఉద్రేకానికి గురయ్యారు. అక్కడ నుంచే బాలినేనికీ, అధిష్టానంలో కీలకంగా వ్యవహ రిస్తోన్న వైవి.సుబ్బారెడ్డికి మధ్య మరింత అగాథం ఏర్పడిందనే చర్చ సాగుతోంది. సిఎం జగన్ కుటుంబానికి దగ్గరగా ఉండేవారంతా తనకు వ్యతిరేకంగా మారారని బాలినేని భావిస్తున్నారు. పలు సార్లు సిఎం జగన్‌తో భేటీలు నడిపారు. అయినా వ్యవహారాలు ఓ కొలిక్కి రాలేదు. బాలినేనికి జిల్లా పగ్గాలు ఇచ్చే విషయంలో స్పష్టత రాలేదు. ఆయన కొంతకాలం జిల్లా రాజకీయాలకు దూరంగా ఉండేందుకు అమెరికా వెళ్లి వచ్చారు కూడా.. తర్వాత హైదరాబాద్‌లోనే ఎక్కువ రోజులు గడుపుతున్నారు. ఇక్కడ జిల్లాలో పార్టీ పగ్గాలతో పాటు ఎంపీ టిక్కెట్టుపైనా స్పష్టత రావాల్సి ఉంది. ఒంగోలు ఎంపీ అభ్యర్థిగా వైవీ తనయుడు విక్రాంత్‌రెడ్డిని బరిలోకి దింపాలనే ఆలోచన సిఎం జగన్ చేశారు. దీనిపైనా బాలినేని విభేదించారు. ఒంగోలు ఎంపీగా మాగుంటే పోటీ చేస్తారని ప్రకటించారు. ఇక్కడా గట్టిగానే అధినేతను కూడా ఢీ కొన్నారనే భావించాల్సి ఉంది. తాజాగా టిటిడి ఛైర్మన్ పదవిని మాజీ మంత్రి శిద్దారాఘవరావుకు సిఫార్సు చేయగా అదీ పని చేయలేదంటున్నారు. ఆఖరు నిమిషంలో సిఎం జగన్‌పై కుటుంబ ఒత్తిళ్లతో ఆ పదవిని బాలినేని సిఫార్సు చేసిన వారికి ▶ 2లో

బాలినేని రాజకీయ మౌనం

(మొదటిపేజీ తరువాయి)

చేజారింది. దీనిపైనా బాలినేని అసంతృప్తిగానే ఉన్నారని సమాచారం. తన మాట చెల్లుబాటు కాలేదని భావిస్తున్నారు. ఇక ఎంపీ సీటు విషయంపైనా చర్చ పెట్టి దానిపై ఏ నిర్ణయం తీసుకుంటారో చూడాలనే ఆలోచనలో బాలినేని ఉన్నట్లు చర్చ సాగుతోంది. దీనిపై సిఎం జగన్ నిర్ణయం ఏమిటి ? జిల్లా పగ్గాలు అప్పగిస్తారా? లేదా? అనేవి తేలితే బాలినేని కూడా తన నిర్ణయం ఏమిటనే దానిపై స్పష్టతకు రావచ్చుని వైసిపి నేతల్లో చర్చ సాగుతోంది. తనకు తగిన ప్రాధాన్యత ఇవ్వనందునే బాలినేని అంతర్మథనం చెందుతున్నారని పార్టీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. ఏదేమైనా బాలినేని రాజకీయ మౌనంపై ఇప్పుడు పెద్ద దుమారమే రేగుతోంది.

నా భూమి - నా దేశం

ప్రజాశక్తి-పిసిపల్లి

మండలంలోని పిసిపల్లి, మురుగమ్మి గ్రామ పంచాయితీల్లో నా భూమి-నా దేశం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం రెండు గ్రామ పంచాయతీల్లో దేశం కోసం జీవితాలను త్యాగం చేసిన వీరులను, నేలతల్లికి నమస్కరిస్తూ శిలాఫలకాల ఏర్పాటు, మొక్కలు నాటడం, పంచప్రాణ ప్రతిజ్ఞ, వీరులకు వందనం, జెండా వందనం కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ, ఎపిఓ, జడ్పిటిసి, సర్పంచి, ఇతర ప్రజాప్రతినిధులు, ఉపాది హామి సిబ్బంది, వెలుగు సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి : జడ్జి

ప్రజాశక్తి - గిద్దలూరు

సెప్టెంబర్ 9న దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు స్వదినియోగం చేసుకోవాలని గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి బి.దేవేంద్ర రెడ్డి తెలిపారు. లోక్ అదాలత్‌లో అన్ని రకాల సివిల్ కేసులు, రాజీ పడదగిన క్రిమినల్ కేసులు, గహ హింస కేసులు, చెక్ బౌన్స్ కేసులు, ప్రీ లిటికేషన్ కేసులు, ఘర్షణ కేసులు రాజీ చేసుకోవచ్చునని తెలిపారు. దీంతో సమయం, డబ్బు ఆదా అవుతుందన్నారు.

ఓటర్ జాబితాలో అక్రమాలపై... కలెక్టర్‌కు ఫిర్యాదు

ప్రజాశక్తి-సిఎస్ పురంరూరల్

మండల పరిధిలోని చెన్నపునాయునిపల్లి ఆరవ వార్డు ఓటరు జాబితాలో చోటు చేసుకున్న అక్రమాలపె గ్రామస్తులు బుధవారం కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. చెన్నపునాయుని పల్లి ఆరవ వార్డుకు ఉప ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు నోటిఫికేషన్ విడుదల చేశారు. ఆ వార్డుకు సంబంధించి ఓటర్ జాబితాను ప్రకటించారు. అధికారులు ప్రకటించిన ఓటర్ జాబితా పూర్తి తప్పులు తడకగా ఉందని సింగిల్ విండో అధ్యక్షుడు, గ్రామస్తుడు పెరుగు సుబ్బరామయ్య కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. 6వ వార్డులో 122 మంది ఓటర్లను తొలగించి వారి స్థానంలో నాలుగోవార్డుకు ఓటర్లు పేర్లు చేర్చినట్లు సుబ్బరావు తన ఫిర్యాదులో పేర్కొన్నారు. అక్రమాలపై విచారణ జరిపించి అర్హులైన వారికి ఓటు హక్కు కల్పించాలని ఆయన కోరారు.

అందుబాటులో జాతీయ జెండాలు

ప్రజాశక్తి - గిద్దలూరు

ఈనెల 15న స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని తపాలా కార్యాలయాల్లో జాతీయ జెండాలు విక్రయిస్తున్నట్లు గిద్దలూరు సబ్ డివిషనల్ పోస్ట్ మాస్టర్ రంగస్వామిరెడ్డి తెలిపారు. పోస్టల్ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గిద్దలూరు పరిధిలోని అన్ని పోస్టు ఆఫీసులలో రూ.25 జాతీయ జెండాలను అందిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరూ జాతీయ జెండాను తమ ఇళ్లపై ఎగురవేయాలని వారు కోరారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకుని స్వతంత్ర దినోత్సవ పండుగను ఘనంగా జరుపుకోవాలని ఆయన తెలిపారు.

ప్రభుత్వ భూమికి పరిహారమా?

- వాగు పోరంబోకు భూమికి పట్టా..
- రూ. 2.72 కోట్ల ప్రభుత్వ నిధులకు ఎసరు.!

శ్మశానానికి కొనుగోలు చేసిన భూమి

ప్రజాశక్తి-మార్కాపురం

'పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు' నిర్మాణం ప్రారంభమైన దగ్గర నుంచి రెవెన్యూలో అక్రమాలకు కొదవలేదనే చెప్పాలి. అక్రమార్కులు ప్రభుత్వ నిధులకు ఎలా ఎసరు పెట్టాలి అనే ఆలోచనలో ఉండగా.. వారి ఆలోచనలకు కొందరు అధికారులు పదును పెట్టారు. ప్రభుత్వ భూములు.. వాగు పోరం బోకు భూములకు సైతం పట్టాలు సృష్టించి అక్రమార్కులకు హక్కులు కల్పించారు. ప్రభుత్వ భూమికి పరిహారం పొందేలా మార్గం సులభతరం చేశారు. అధికారులు ఏర్పాటు చేసిన రాచమార్గంలో ఏకంగా రూ.2.72 కోట్ల నిధుల బొక్కేందుకు ఎసరు పెట్టారు.!

పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు పరిధిలోని ముంపు గ్రామాల్లో నిర్వాసితుల కోసం మార్కాపురం పరిసర ప్రాంతాల్లో పునరావాస కాలనీలు ఏర్పడుతున్నాయి. ముంపు గ్రామాల్లో ఒకటైన కలనూతల గ్రామానికి ఇడుపూరు ఇలాఖాలోని దరిమడుగు గ్రామ పరిధిలో పునరావాసం కల్పించేందుకు చర్యలు తీసుకున్నారు. ఇడుపూరు-1, ఇడుపూరు-2 కాలనీలో ఇక్కడే ఉన్నాయి. ఇడుపూరు-1 కాలనీ కోసం శ్మశాన భూమి అవసరమైంది. అక్కడే ప్రభుత్వ భూమి ఉంది. కొందరు ప్రభుత్వ నిధులను ఎలా సమకూర్చుకోవాలనే పన్నాగం పన్నారు. ఇడుపూరు-1 కాలనీకి సమీపంలో ప్రభుత్వ భూమి ఉంది. సర్వే నెంబరు 933/1లో ఎ॥ 3.62 సెం॥ విస్తీర్ణం కలిగివుంది. ఆ భూమి వాస్తవంగా వాగు పోరంబోకు. ఆ భూమిని ప్రభుత్వ అవసరాలకు వినియోగించుకోవడం తప్ప.. మరొకరికి పట్టా ఇచ్చి హక్కులు కల్పించేలా నిబంధనలు లేవు. 2009లో అక్రమాధికారులు అప్పటి అధికార పార్టీ నేతల ఒత్తిడితో ఓ వ్యక్తికి అసైన్డ్ పట్టా మంజూరు చేయడం జరిగింది. అక్రమంగా పట్టా పొందిన ప్రభుత్వ భూమిని తిరిగి ప్రభుత్వానికి విక్రయించేలా ప్రణాళిక రచించారు. ఇడుపూరు-1 కాలనీలో కలనూతల నిర్వాసితుల కోసం శ్మశానవాటిక అవసరమని, అందు కోసం సర్వే నెంబరు 933/1లోని 3.62 ఎకరాల భూమి అవసరమని ప్రభుత్వానికి వెలిగొండ ప్రాజెక్టు భూ సేకరణ అధికారులు ప్రతిపాదనలు పంపారు. ఒక్కో ఎకరం ఖరీదు రూ.68 లక్షలుగా నిర్ణయించారు. ఈ విధంగా ఆ భూమికి రూ. 2.72 కోట్లు అప్పనంగా ప్రభుత్వ భూమిని.. ప్రభుత్వానికే అమ్మకం పెట్టి రూ.కోట్లలో కొట్టేసేందుకు పన్నాగం పన్నారు. ప్రభుత్వం కూడా నిధులను త్వరలో ఇవ్వనుందని, పట్టా పొందిన వ్యక్తి ఖాతాలో ఆ నిధులు జమ కానున్నట్లు తెలిసింది.

వాస్తవంగా సర్వే నెంబరు 933/1లోని 3.62 ఎకరాల భూమి వాగు పోరంబోకు. ప్రభుత్వ ఆధీనంలో ఉండాల్సిన భూమి అది. ఆ భూమిలో పూర్వ కాలం నుంచీ దరిమడుగు గ్రామానికి చెందిన జవ్వాజి రంగయ్య, గోన రంగయ్య అనే వ్యక్తులు ఆ భూమిని మలేసుకుంటూ పశువుల మేతగా వాడుకుం టున్నారు. జవ్వాజి రంగయ్య, గోన రంగయ్యల వారసులు అనుభవంలో ఉన్నట్లు రికార్డులో ఉంది. ఆ భూమికి పట్టా ఇవ్వాలని అనుభవంలో ఉన్న వ్యక్తులు అధికారులను కోరినా... వాగు పోరంబోకు భూమి కావడంతో ఇవ్వలేమని చెప్పారు. దీంతో ఆ భూమి అలాగే ఉంది. 2009లో మాత్రం వెలిగొండ ప్రాజెక్టు ద్వారా పరిహారం డబ్బు పెద్ద మొత్తంలో వస్తుందని తెలుసుకున్న కొందరు వ్యక్తులు, అధికారులు పైన పేర్కొన్న విధంగా అక్రమంగా పట్టా పుట్టించి ప్రభుత్వ నిధులను కాజేసేందుకు సహకరించారు. ఈ భూమిపై ఉన్నతాధికారులు విచారణ చేపడితే ఎవరు అక్రమాలకు పాల్పడిన విషయం వెలుగులోకి రానుంది.

కార్పొరేట్ శక్తులను తరిమికొట్టండి

(మొదటిపేజీ తరువాయి)

ప్రైవేటీకరణ చేసేం దుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ముందుకు వచ్చిందని, వ్యతిరేకించిన ప్రజానీకానికి ఎటువంటి సమాధానం చెప్పకుండా ఉక్కు పరి శ్రమలు అమ్మివేస్తామని, ప్రజాభిప్రాయా నికి వ్యతిరేకంగా బిజెపి ప్రభుత్వం మాట్లాడు తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాభి ప్రాయ సేకరణ చేయకుండా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పార్లమెంటులో కరోనా సమ యంలో దొంగచాటుగా కార్పొరేట్ శక్తులకు అనుకూలమైన మూడు నల్ల వ్యవసాయ చట్టాలను తీసుకొచ్చిందన్నారు. దేశంలోని రైతాంగం ప్రజానీకం వ్యతిరేకించినా బిజెపి ప్రభుత్వం ఖాతరు చేయలేదని, ఏడాదికి పైగా ఢిల్లీ శివార్లలో రైతాంగం చేసిన ఉద్యమానికి తలొగ్గి మూడు వ్యవసాయ చట్టాలను వెనక్కి తీసుకుంటున్నట్లు ప్రకటించి ప్రధాని మోడీ దేశ ప్రజలకు బహిరంగంగా క్షమాపణ చెప్పారన్నారు. ఆ సమయంలో ప్రధాని మోడీ లిఖితపూర్వకంగా రైతాంగానికి ఇచ్చిన ఒక్క హామీని కూడా అమలు చేయలేదని విమర్శించారు. దేశంలోని రైతాంగం శతాబ్దాలుగా డిమాండ్ చేస్తున్న స్వామినాథన్ కమిటీ సిఫార్సుల మేరకు పంటలకు మద్దతు ధర ఇచ్చి చట్టబద్ధత కల్పించాలనే డిమాండ్‌ను నిర్వీర్యం చేశారన్నారు. ప్రభుత్వ మైక్రో ఫైనాన్స్, ప్రైవేట్ రుణాలతో సహా అన్ని రుణాల ఉచ్చు నుండి అన్ని వ్యవసాయ కుటుంబాలకు విముక్తి చేయడానికి సమగ్ర రుణమాఫీ పథకాన్ని ప్రకటించాలని డిమాండ్ చేశారు. విద్యుత్ సవరణ బిల్లు 2022ను ఉపసంహరించుకోవడంతో పాటు గ్రామీణ గహాలకు 300 యూనిట్లు ఉచిత విద్యుత్తుతో పాటుగా, వ్యవసాయ నీటి మోటార్లకు స్మార్ట్ బిగించే ప్రక్రియను వెనక్కి తీసుకోవాలన్నారు. ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా కార్యదర్శి పమిడి వెంకటరావు మాట్లాడుతూ ఏ కార్పొరేట్‌లకు అనుకూలమైన పిఎం ఫసల బీమా యోజన పథకాన్ని రద్దు చేసి రైతాంగానికి, వ్యవసాయ కూలీలకు అనుకూలమైన పిఎం ఫసల్ బీమా యోజన పథకాన్ని అమలులోకి తేవాలని డిమాండ్ చేశారు.

ఏపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు కంకణాల ఆంజనేయులు, కౌలు రైతుసంఘం జిల్లా కార్యదర్శి వి బాలకోటయ్య మాట్లాడుతూ దేశంలో 90 శాతంగా ఉన్న రైతులు, రైతు కూలీలను ఏమార్చి ప్రధాని మోడీ కేవలం రెండు శాతంగా ఉన్న కార్పొరేట్ శక్తులకు దేశ సంపదలను దోచిపెట్టడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. ఏపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వి.హనుమారెడ్డి మాట్లాడుతూ లఖింపూర్ ఖేరీలో ఖైదీ చేయబడిన రైతులపై నకిలీ కేసులను ఉపసంహరించుకొని వెంటనే వారిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఆచార్య రంగా కిసాన్ సంస్థ ప్రధాన కార్యదర్శి చుంచు శేషయ్య మాట్లాడుతూ చారిత్రాత్మకమైన కిసాన్ పోరాటంలో అమరులైన 750 మంది రైతుల కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించటంతో పాటు పునరావాసం కల్పించాలని డిమాండ్ చేశారు. అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్టిపాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మధ్యస్త, చిన్న, సన్నకారు స్త్రీ పురుష రైతులకు వ్యవసాయ కార్మికులందరికీ నెలకు రూ.10 వేలు పింఛన్ పథకాన్ని ప్రకటించాలని డిమాండ్ చేశారు. అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి ఎన్ నాగరాజు, రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు కె కోటేశ్వరరావు ప్రసంగించారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు కాలం సుబ్బారావు, ఏఐటియుసి జిల్లా నాయకులు పివిఆర్ చౌదరి, ఏఐఎఫ్‌టియు జిల్లా నాయకులు ఎం ఎస్ సాయి, ఐఎఫ్‌టియు జిల్లా నాయకులు సిహెచ్ శేషాద్రి బాబు మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక ప్రభుత్వమని దుయ్యబట్టారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాల స్థానంలో నాలుగు కార్మిక కోడ్ లను తీసుకువచ్చి దేశంలోని కార్మికులను కట్టు బానిసలుగా మారుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రానున్న ఎన్నికలలో బిజెపిని దేశాన్ని నుండి తరిమివేయటమే లక్ష్యంగా ప్రతి ఒక్కరు పని చేయడానికి పిలుపునిచ్చారు. ధర్నా కార్యక్రమంలో సిఐటియు నాయకులు జివి కొండారెడ్డి, జి రమేష్, ఏపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు కె.వీరారెడ్డి, ఏఐటియుసి జిల్లా నాయకులు ఎస్‌డి సర్దార్, ఏఐకేకెఎస్ జిల్లా నాయకులు బి సుబ్బారావు, ఓపిడిఆర్ రాష్ట్ర అధ్యక్షులు చావలి సుధాకర్‌రావు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I,VERRI NAGESWARA RAO
s/o. VERRI VENKATA SUBBAIAH(Old Name)
resident of Flat No - 103,Gopi Residency,2nd floor Santhapeta,Ongole Mandal,Prakasam District
I have changed my name from
VERRI NAGESWARA RAO to
VERRU NAGESWARA RAO
s/o.VERRI VENKATA SUBBAIAH(New Name)
Hence forth i will be konws as
VERRU NAGESWARA RAO
will be applicable for all purpose

CHANGE OF NAME

I, SAYYAD MAHBUB SUBHANI
s/o.HUSSEN(Old Name)
resident of D.No.2-287, Kadavakuduru Road, Inkollu,Prakasam District, Andhra Pradesh,India-523167.
I have changed my name from
SAYYAD MAHBUB SUBHANI to
SAYYED SUBHANI
s/o.HUSSEN (New Name)
Hence forth i will be knows as
SAYYED SUBHANI
will be applicable for all purpose

CHANGE OF NAME

I, **RAVINUTALA VENKAT SUBBAIAH** (Old Name) s/o **RAVINUTHALA SATYANARAYANA,** residing at D.No. 9-2-6 , Jamedar Street, Ongole Town and Ongole Mandal, Prakasam District, Andhra Pradesh, India-523002. I have changed my name from **RAVINUTALA VENKAT SUBBAIAH** (Old Name) to **RAVINUTHALA VENKATA SUBBAIAH** (New Name). Henceforth I am being called as **RAVINUTHALA VENKATA SUBBAIAH** for all purposes

ఆక్రమణలపై సమగ్ర విచారణ జరిపించాలి

ప్రజాసంఘాల ఐక్యవేదిక జిల్లా నాయకులు జివి కొండారెడ్డి

ప్రజాశక్తి-కనిగిరి

కనిగిరిలో జరుగుతున్న భూ ఆక్రమణలపై మెజిస్ట్రీరియల్ సమగ్ర విచారణ చేపట్టాలని ప్రజాసంఘాల ఐక్యవేదిక జిల్లా నాయకులు జివి కొండారెడ్డి డిమాండ్ చేశారు. భూ ఆక్రమణలను నిలువరించి ఆక్రమణదారులపై చర్యలు చేపట్టాలనే అంశంపై కనిగిరి ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం బుధవారం జరిగింది. సమావేశాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ సిపిఎం పోరాట ఫలితంగా పేదలకు నివేశన స్థలాలు పంపిణీ జరుగగా సూరా పాపిరెడ్డి నగర్ ఏర్పాటయ్యిందని, అందులో ఇతర అవసరాల కోసం వదిలిన స్థలాలను, పేదలు పొందిన స్థలాలను ఆక్రమించి విక్రయాలు చేపట్టటం దారుణమన్నారు. అంతటితో ఆగని ఆక్రమణదారులు పక్కనే ఉన్న వాగు పోరంబోకు భూమిని ఆక్రమించి ప్లాట్లు పెట్టి విక్రయించటం, నిర్మాణాలు చేపట్టటం చూస్తే ఆక్రమణదారులకు అధికారుల, అధికారపక్ష నాయకుల అండదండలు ఏవిధంగా ఉన్నాయో ఇట్టే తెలిసిపోతోందన్నారు. ఆక్రమణలను అడ్డుకోవాల్సిన అధికార యంత్రాంగం ఆక్రమణదారులకు సహకారం అందించటం దుర్మార్గమన్నారు. ఆక్రమణలపై ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకులు పోరాటం చేస్తే వారిపై విచారణ జరపకుండా కేసులు నమోదు చేయటం సరికాదన్నారు. ఆక్రమణలు జరిగినట్లు గుర్తించిన అధికారులు ఆక్రమణదారులపై కేసులు నమోదు చేయించటంలో చర్యలుచేపట్టటంలో ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనేదానికి తప్పక సమాధానం చెప్పాల్సి ఉంటుదన్నారు. జిల్లా ఉన్నతాధికారులు చొరవచూపి ప్రభుత్వ భూములు కాపాడేలా ఆక్రమణదారులను కఠినంగా శిక్షించేలా చర్యలు చేపట్టాలని, లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ప్రజాసంఘాల ఐక్యవేదిక కన్వీనర్ పిసి కేశవరావు, ఎస్‌కె బషీరా, ఎస్‌కె ఖాదర్‌వలి, జి శ్రీను, పెద్దన్న, ప్రసన్న, మైమూన్, రత్నమ్మ, యు పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న జివి కొండారెడ్డి

ప్రతి ఆర్టీసీ బస్సు బస్టాండ్‌కు రావాలి

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ ఆర్‌టిసి బస్టాండ్ నుంచి దాటి వెళ్లి ప్రతి ఆర్టీసీ బస్సు బస్టాండ్ లోపలికి వచ్చి వెళ్లాలని ఆర్టీసీ జోనల్ చైర్మన్ బత్తుల సుప్రజారెడ్డి ఆదేశాలు జారీ చేయడంతో ఆర్టీసీ అధికారులు రోడ్డెక్కారు. మంగళవారం రాత్రి నుంచి బుధవారం రాత్రి వరకు ఆర్టీసీ అధికారులు జాతీయ రహదారిపై ఉండి శింగరాయకొండ ఆర్టీసీ బస్టాండ్‌కు బస్సులు వెళ్లాలని సూచించారు. విజయవాడ వైపు నుంచి బెంగళూరు వెళ్లే బస్సులు బెంగళూరు, తిరుపతి, నెల్లూరు నుంచి విజయవాడ వైపు వెళ్లే బస్సులు కచ్చితంగా ఆర్టీసీ బస్టాండ్‌లోకే వెళ్లి సంతకం చేసి పోవాలని ఆర్టీసీ అధికారులు సూచించడంతో బస్టాండ్ వైపు బస్సులు రావడం మొదలయ్యాయి. ప్రయాణికులు బస్సులు బస్టాండ్‌కు రాత్రులు సమయంలో రావడం లేదని చెప్పడంతో జోనల్ చైర్మన్ బత్తుల సుప్రజారెడ్డి సీరియస్‌గా తీసుకొని ఆర్టీసీ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఆర్టీసీ అధికారులు జాతీయ రహదారి మీద ఉండి బస్సులు బస్టాండ్‌కు వచ్చే విధంగా ప్రయత్నాలు మొదలుపెట్టారు.

ప్రజాసమస్యల పరిష్కారమే సిపిఎం లక్ష్యం

ప్రజాశక్తి-దరిశి

ప్రజాసమస్యల పరిష్కారమే సిపిఎం జిల్లా లక్ష్యమని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం రమేష్ అన్నారు. బుధవారం స్థానిక సుందరయ్య భవనంలో సిపిఎం దరిశి నియోజకవర్గ కార్యకర్తలకు శిక్షణ తరగతులు ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. ప్రజల మీద వైసిపి ప్రభుత్వం కరెంట్ ఛార్జీలను భారీగా పెంచిందన్నారు. మణిపూర్‌లో మారణహోమం జరిగిన బిజెపికి పార్లమెంటులో టిడిపి, వైసిపి మద్దతు పలకడం దుర్మార్గమని విమర్శించారు. బిజెపి పాలనకు విశ్వాస తీర్మానంలో జగన్మోహన్‌రెడ్డి మోడీకి సపోర్టు చేయడం కేంద్రానికి లొంగిపోవడమేనని విమర్శించారు. ఈ సందర్భంగా నూతన ఆర్థిక విధానాలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనే అంశంపై తరగతులు బోధించారు. ఈ కార్యక్రమంలో సందు వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించగా నాయకులు వెల్లంపల్లి ఆంజనేయులు, కెవి పిచ్చయ్య, పుల్లయ్య, నారాయణ, నాగేశ్వరరావు, గంగయ్య, ఇమ్మాయిల్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రమేష్

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

ప్రజాశక్తి-కొనకనమిట్ల

ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని సర్పంచ్ లక్ష్మీ వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం మండలంలోని గనివెనపాడులో నా భూమి నా దేశం కార్యక్రమంలో భాగంగా గ్రామంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. సర్పంచ్ లక్ష్మీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ భవిష్యత్ తరాలు ఆరోగ్యంగా జీవించాలంటే, ప్లాస్టిక్ వస్తువులను నిషేధిస్తూ మనమందరం మొక్కలు నాటే కార్యక్రమం తప్పకుండా చేయాలన్నారు. చెట్లను విచక్షణారహితంగా నరికి వేయకూడదన్నారు. అనంతరం గ్రామంలో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అద్దంకి శ్రీనివాస్‌మూర్తి ఏపీవో బులెన్‌రావు, ఇసి శ్రీనివాసులురెడ్డి, టిఎ సురేష్, ఎఫ్ఎ గోపాలకృష్ణ, ఎంపిపి పాపారావు, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బాధితుడు సత్తార్‌కు మాజీమంత్రి పరామర్శ

ప్రజాశక్తి-భట్టిప్రోలు

మండల కేంద్రం భట్టిప్రోలులో సోమవారం పోలీసుల వేధింపులు తట్టుకోలేక పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడి చికిత్స పొందుతున్న షేక్ అబ్దుల్ సత్తార్‌ను బుధవారం మాజీమంత్రి టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు నక్కా ఆనందబాబు పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆనందబాబు మాట్లాడుతూ గత 40 ఏళ్లుగా సత్తార్ నిజాయి తీగా పాత ఇనుము వ్యాపారం చేసుకుంటూ ఉండేవాడని, టిడిపి సానుభూతి పరుడుగా ఉండటం వలన అతని వ్యాపారాన్ని దెబ్బతీసేందుకు పోలీసులు, అధికార పార్టీ నాయకుల మాటలు విని ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. గతంలో ఎవరో చేసిన దొంగతనాన్ని ఆసరాగా తీసుకుని సత్తార్‌పై అక్రమ కేసులు బనాయించి అతని వద్ద వేలాది రూపాయిలు దండుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక్కడ పని చేస్తున్న ఎస్ఐ, పోలీస్ కానిస్టేబుళ్లు మాత్రమే కాక ఇక్కడ పని చేసి చెరుకుపల్లికి వెళ్లిన ఎస్ఐ కూడా అక్రమ వసూళ్లకు బెదిరిస్తున్నారని దీని కారణంగా ఆత్మహత్యకు పాల్పడ్డాడని వ్యాఖ్యానించారు. ఈయన వెంట టిడిపి రాష్ట్ర కార్యదర్శి తుమగుంట్ల సాయిబాబా తదితరులు ఉన్నారు.

బిజెపి మతోన్మాదానికి ప్రజలు చరమగీతం పాడాలి

ప్రజాశక్తి-దరిశి

బిజెపి మతోన్మాదానికి వచ్చే ఎన్నికలలో ప్రజలు చరమగీతం పాడాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి వెల్లంపల్లి ఆంజనేయులు అన్నారు. బుధవారం వ్యవసాయ కార్మిక సంఘం దరిశి మండలంలో క్విట్ ఇండియా రోజున నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బిజెపి పాలన కుల వివక్షతతో మతోన్మాదాన్ని ప్రోత్సహిస్తుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సందు వెంకటేశ్వర్లరావు, ఏడుకొండలు, పుల్లయ్య, రామాంజనేయులు, మోహన్‌రావు, నరసింహ, రవి పాల్గొన్నారు.

హోం శాఖ కోసం వినతి

ప్రజాశక్తి వేటపాలెం

తమకు మదర్ డిపార్ట్మెంట్ గా హోంశాఖనే కేటాయించాలి అని కోరుతూ వేటపాలెం మండలం సచివాలయాల మహిళా పోలీసులు బుధవారం ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తికి వినతిపత్రం అందించారు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన సచివాలయ వ్యవస్థ ప్రజలు హర్షించారన్నారు సచివాలయ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిని మహిళలకు ఎంతో రక్షణగా నిలుస్తున్నామని చెప్పారు మహిళా పోలీసుల చట్టాన్ని రూపొందించి తమకు హోం శాఖ కేటాయించాలని ఈ సందర్భంగా వారు మొరపెట్టుకున్నారు ఈ కార్యక్రమంలో మహిళా పోలీసులు అంబికా నీలిమ సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలలో ఉచిత యూనిఫామ్ పంపిణీ

ప్రజాశక్తి-పెద్దారవీడు

స్థానిక పెద్దారవీడు మండలం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రకాశం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు విద్యార్థులందరికీ యూనిఫామ్ ధరించాలని ఆదేశించారు. ఈ ఆదేశాల మేరకు కళాశాల ప్రిన్సిపాల్ షేక్ మహబూబ్‌బాషా ఆధ్వర్యంలో ఆ కళాశాలలో పని చేస్తున్న భౌతిక శాస్త్ర, రసాయన శాస్త్ర అధ్యాపకులు రామకృష్ణ, రమణారావు తమ సొంత ఖర్చులతో విద్యార్థులకు ఉచితంగా యూనిఫాం దుస్తులు అందించారు. కళాశాల ప్రిన్సిపల్ బాషా, అధ్యాపకులు, గ్రామ పెద్దలు వారిని అభినందించారు. విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థినులకు దుస్తులు అందిస్తున్న రామకృష్ణ, రమణారావు

మృతిచెందిన బాలుడు అమన్

ఆయిల్ ట్యాంకర్ ఢీకొని బాలుడు మృతి

ప్రజాశక్తి-పెద్దారవీడు

పెద్దారవీడు మండలం దేవరాజుగట్టు గ్రామంలో ప్రైవేట్ స్కూల్లో యుకెజి చదువుతున్న విద్యార్థి పాఠశాల ముగించుకొని బుధవారం ఉదయం వ్యాన్ దిగి ఇంటికి వెళ్తున్న సమయంలో ఆయిల్ ట్యాంక్ వ్యాన్ ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆ విద్యార్థి సయ్యద్ అమన్(6) అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయం తెలిసిన బాలుడి తల్లిదండ్రులు సయ్యద్ అజిత్, సయ్యద్ సకీరతో పాటు గ్రామస్తులు రోడ్డుపై బైఠాయించారు. పాఠశాల యాజమాన్యం, డ్రైవర్, క్లీనర్ల నిర్లక్ష్యం వల్లనే తమ బాలుడు మృతి చెందాడని, వారిపై చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు. సయ్యద్ అజిత్, సయ్యద్ సకీరలకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు కాగా కుమారుడు మృతి చెందడంతో వారు కన్నీరు మున్నీరవుతున్నారు.

మోటార్ సైకిలిస్ట్ మృతి

ప్రజాశక్తి-పంగులూరు

మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ

లారీ డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా, ఒక మోటార్ సైకిల్ వాహనదారుడు మృతి చెందిన సంఘటన మంగళవారం రాత్రి కొండమంజులూరు గ్రామంలో జరిగింది. రేణింగవరం ఎస్ఐ కేకే తిరుపతిరావు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని కొండమంజులూరు గ్రామానికి చెందిన అమృతలూరి శ్రీనివాసరావు(38) మంగళవారం రాత్రి 9 గంటల సమయంలో టీ తాగేందుకు జాతీయ రహదారికి మోటార్ సైకిల్ పై వెళుతున్నాడు. మార్గమధ్యంలో కొండ మంజులూరు దాటిన తర్వాత, రోడ్డు మధ్యలో ఒక లారీ ఆగి ఉంది. లారీ డ్రైవరు నిర్లక్ష్యంగా, అజాగ్రత్తగా, రోడ్డు మధ్య భాగాన చీకట్లో లారీని పెట్టి వెళ్లిపోయాడు. మోటార్ సైకిల్‌పై వెళుతున్న అమృతలూరు శ్రీనివాసరావు చీకట్లో లారీ వెనుక భాగంలో మోటారు సైకిల్ ఢీకొంది. ఈ ప్రమాదంలో శ్రీనివాసరావుకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం అద్దంకి ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో చనిపోయాడని ఎస్ఐ తిరుపతిరావు తెలిపారు. మృతుడికి 14, 11, సంవత్సరాల వయసు గల ఇద్దరు కుమారులు, భార్య ఉన్నారని తెలిపారు. రోడ్డుకు అడ్డంగా లారీని నిలిపి, ప్రమాదం కారకుడైన లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎవరైనా సరైన జాగ్రత్తలు తీసుకోకుండా, అనవసరంగా రోడ్డుమీద వాహనాలు నిలిపి, రోడ్డు ప్రమాదాలకు కారణమైతే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ తిరుపతిరావు హెచ్చరించారు.

డ్రాగెన్ ఫ్రూట్స్ అమ్మకాలను ప్రారంభిస్తున్న జిల్లా ఉద్యానశాఖ అధికారి గోపిచంద్

డ్రాగెన్ ఫ్రూట్స్ ఆరోగ్యానికి మేలు

ప్రజాశక్తి-దరిశి: డ్రాగెన్ ఫ్రూట్స్ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని జిల్లా ఉద్యానశాఖ అధికారి వై గోపిచంద్ అన్నారు. బుధవారం తాళ్లూరు మండలం మాధవరంలో రైతు రామిరెడ్డి పండించిన తోటను ఆయన పరిశీలించారు. రైతుకు పలు సూచనలు సలహాలు అందించారు. డ్రాగెన్ ఫ్రూట్స్ అమ్మకాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

పేదల మేలు కోసమే వైఎస్ఆర్ కళ్యాణమస్తు

ప్రజా శక్తి - బాపట్ల జిల్లా

పేద కుటుంబాలకు మేలు చేయడం కోసమే వైఎస్ఆర్ కళ్యాణమస్తు పథకాన్ని ప్రభుత్వం అమలుచేస్తుందని జిల్లా ఇన్చార్జి కలెక్టరు చామకూరి శ్రీధర్ తెలిపారు. వైఎస్ఆర్ కళ్యాణమస్తు, వైఎస్ఆర్ షాదీతోఫా పథకం నగదు పంపిణీని సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లిలోని తన క్యాంపు కార్యాలయం నుంచి వర్చువల్ విధానంలో బుధవారం ప్రారంభించారు. అధికారులు, నవ దంపతులనుద్దేశించి సిఎం ప్రసంగించారు. స్థానిక కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో ఎంఎల్‌సి పోతుల సునీత, ఎంఎల్ఎ కోన రఘుపతి చేతుల మీదుగా లబ్దిదారులైన నవదంపతులకు చెక్కురూపంలో నగదును పంపిణీ చేశారు. ఎస్సి, ఎస్టి, బిసి, మైనార్టీ, దివ్యాంగులు, ఆర్థికంగా వెనుకబడిన వారికోసం పథకం అమలు చేస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో 403 దంపతులకు



కళ్యాణమస్తు చెక్కులు అందజేస్తున్న ఎంఎల్‌సి పోతుల సునీత, ఎంఎల్ఎ కోన రఘుపతి, ఇన్‌ఛార్జి కలెక్టర్ శ్రీధర్

రూ.3.22కోట్లను అందించారు. ఇప్పటివరకు జిల్లాలో 761 దంపతులకు రూ.6.31కోట్ల నగదును అందించామన్నారు. బాల్య వివాహాలు అరికట్టడానికే ఈ పథకాలను ప్రభుత్వం సవరించిందని ఎంఎల్‌సి పోతుల సునీత చెప్పారు. బాలికల విద్యను ప్రోత్సహించడానికి ప్రభుత్వం ఎంతో కృషిచేస్తుందన్నారు. రాష్ట్రంలో సుపరిపాలన సాగుతున్నందున ప్రజలంతా ఆనందంగా ఉన్నారని వర్ణించారు. పేదలు సుభిక్షంగా ఉండాలని, అభివృద్ధి పథంలో రాష్ట్రం పయనిస్తుందని ఎంఎల్ఎ కోన రఘుపతి అన్నారు. జగన్మోహన్‌రెడ్డి చరిత్రలో నిలిచిపోయే ముఖ్యమంత్రి అని అన్నారు. కుల, మత, రాజకీయలకు అతీతంగా నిరుపేద కుటుంబాలలో వివాహం చేసుకున్న వారికి ఆర్థిక సహాయాన్ని అందించడం సంతోషంగా ఉందన్నారు. వివక్షత లేని సమాజం కోసం సిఎం కృషిచేస్తున్నారనే విశ్వసనీయత ప్రజల్లో కల్పించాలని కోరారు. ఇంటర్మీడియట్ విద్యార్హత తప్పనిసరి చేయడం ద్వారా డ్రాపౌట్స్ నివారించవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సి సంక్షేమ సాధికారత అధికారిణి జె రాజదెబోరా, డిఆర్డిఏ పిడి బి అర్జునరావు పాల్గొన్నారు.

విద్యార్థికి మంత్రి మేరుగ అభినందన

యుపిఎస్‌సి టాపర్‌ను అభినందిస్తున్న మంత్రి నాగార్జున

రేపల్లె : యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన సెంట్రల్ గ్రూప్ ఏ సర్వీస్ పరీక్షలలో విజయం సాధించిన దోవ ప్రతాప్‌ను సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున అభినందించారు. మండలంలోని బొబ్బర్లంక గ్రామానికి చెందిన నిరుపేద రైతు కూలీ దోవ కృపారావు కుమారుడు ప్రతాప్ యూపీఎస్సీ పరీక్షలలో ఓపెన్ కేటగిరిలో 66వ ర్యాంకు సాధించి సెంట్రల్ ఎంప్లాయిస్ స్టేట్ ఇన్సూరెన్సు కార్పొరేషన్, మినిస్టరీ అఫ్ లేబర్ అండ్ ఎంప్లాయిమెంట్‌లో డిప్యూటీ డైరెక్టర్ ఇన్ సెంట్రల్ ఎంప్లాయిస్ స్టేట్ ఇన్సూరెన్సు కార్పొరేషన్ ఉద్యోగం సాదిచటం అభినందనీయమని అన్నారు. ప్రతాప్ తన ప్రాథమిక విద్యను బొబ్బొర్లంక ప్రభుత్వ పాఠశాలలో చదివి ఉన్నత స్థాయికి చేరుకున్నారని చెప్పారు. సివిల్ సర్వీస్ పరీక్షలలో కూడా నాలుగు సార్లు మెయిన్స్ రాసి ఇంటర్వ్యూ వరకు వెళ్లారని చెప్పారు. సెంట్రల్ సర్వీస్‌లలో ప్రతిభ కనబరచిన ప్రతాప్‌ను రాజ్య సభ సభ్యులు మోపిదేవి వెంకట రమణరావు, ఎంఎల్ఎ అనగాని సత్యప్రసాద్, మాజీ ఎంఎల్ఎ దేవినేని మల్లికార్జునరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ గుజ్జర్లముడి ప్రశాంత్ శుభాకాంక్షలు తెలిపారు.

ప్రిన్స్ మహేష్ పుట్టినరోజు కేక్ కట్ చేస్తున్న కృష్ణమోహన్

ప్రిన్స్ మహేష్ జన్మదిన వేడుకలు

పర్చూరు : ప్రిన్స్ మహిష్ 48వ జన్మదిన వేడుకలను అభిమానులు ఘనంగా నిర్వహించారు. స్థానిక బొమ్మలసెంటర్లో మహేష్‌బాబు ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. స్నేహితులతో కలిసి ఆనందాన్ని పంచుకున్నారు. సందర్భంగా నాగులపాలెం బదిరుల పాఠశాలలో కేక్ కట్ చేశారు. విద్యార్థులకు అన్నదానం చేశారు. దేవరపల్లి ఉపసర్పంచి తోకల కృష్ణమోహన్ కేక్ కట్ చేసి విద్యార్థులకు పంచిపెట్టారు. కార్యక్రమంలో మహేష్ అభిమానులు నూతలపాటి సుబ్రమణ్యం, ఆకుల శ్రీనివాసరావు, తాటి సుబ్బయ్య, టి శంకర్, షేక్ గౌస్, పాఠశాల మేనేజర్ కోమటి ఆంజనేయులు, కె శేషుబాబు, ఎన్ శ్రీనివాసరావు, మిన్నికంటి శివ, పి కిరణ్, షేక్ కరిముల్లా, ఎస్‌కె సుభాని, ఓ శివయ్య, అశోక్, పి రమణ(బుజ్జి) పాల్గొన్నారు.

ఒరిగిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

సంతమాగులూరు : స్థానిక బీసీ హాస్టల్ సమీపంలోని 100కెవీ విద్యుత్ ట్రాన్స పార్మర్ వద్ద ప్రమాదం పొంచి ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. సిమెంట్ వరల మీద ట్రాన్స్‌ఫార్మర్ నిలబెట్టడంతో కుంగిపోయింది. దీంతో ట్రాన్స పార్మర్ ఒరిగి ఎప్పుడు పడుతుందో తెలియని పరిస్థితి ఏర్పడింది. సమీపంలో ప్రాథమిక పాఠశాల, బీసీ హాస్టల్ ఉంది. స్కూల్ పిల్లలు ట్రాన్స పార్మర్ సమీపంలో ఆటలాడుతుంటారు. ట్రాన్స పార్మర్ తీగలు పిల్లలకు అందే ఎత్తులో ఉన్నాయి. పిల్లల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సమీపంలో ఉన్న విద్యుత్ సబ్ స్టేషన్ అధికారులు ప్రతిరోజు ఇదే రహదారిపై వెళుతూ ఒరిగివున్న విద్యుత్ ట్రాన్స ఫార్మర్‌ను చూస్తూనే ఉన్నారు. కానీ పట్టించుకోవడంలేదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి శాశ్వతంగా దిమ్మెను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఒరిగిన ట్రాన్స్‌ఫార్మర్

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ శ్రీధర్

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

ఎస్టీలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని జిల్లా ఇన్చార్జి కలెక్టర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. స్థానిక కలెక్టరేట్లోని స్పందన హాలులో ప్రపంచ ఆదివాసీ దినోత్సవం నిర్వహించారు. ముందుగా ఎస్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పట్టణంలో ప్రదర్శన నిర్వహించారు. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఎంఎల్‌సి పోతుల సునీతతో కలిసి జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఒకప్పుడు అటవీ ప్రాంతంలో జీవించే వారంతా జనజీవన స్రవంతిలో కలిశారని గుర్తు చేశారు. మంచి సంస్కృతి, సంప్రదాయాలతో అభివృద్ధి చెందాలన్నారు. పిల్లలను బాగా చదివించాలన్నారు. ఆత్మస్థైర్యంతో అడుగులు వేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఇన్చార్జి అధికారిని జె రాజదిబోరా, గిరిజన సంఘాల నాయకులు టి సాంబయ్య, దేవరకొండ రాము, ఎస్ వెంకటేశ్వర్లు, బి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి కలెక్టర్ శ్రీధర్

బాల కార్మిక నిర్మూలనకు కృషి

ప్రజాశక్తి - బాపట్ల రూరల్

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ సాయిజ్యోతి అన్నారు. పట్టణంలోని పలు మెకానికల్ షాపులు, వ్యాపార సముదాయాల్లో ఆమె తనిఖీలు చేశారు. 14ఏళ్లలోపు పిల్లలను పనుల్లో పెట్టు కోరాదని అన్నారు. విస్తృతంగా తనిఖీలు చేస్తున్నామని చెప్పారు.

సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - చీరాల

హౌసింగ్ లబ్ధిదారుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఎమ్మెల్యే కరణం బలరాం కృష్ణమూర్తి అధికారులను ఆదేశించారు. స్థానిక ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో హౌసింగ్ అధికారులతో బుధవారం సమావేశం నిర్వహించారు. అర్హత కలిగిన లబ్ధిదారులకు స్థలాల కేటాయింపుపై అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో డీఈ గోవిందరెడ్డి, ఏఈ శ్రీనివాసరెడ్డి ఉన్నారు.

విద్యుత్ చౌర్యానికి పాల్పడితే చర్యలు

ప్రజాశక్తి - చీరాల

విద్యుత్తు చౌర్యానికి పాల్పడితే చర్యలు తీసుకుంటామని ఎపిఎస్‌పిడిసిఎల్ డివిజన్ ఈఈ కె సూర్యప్రకాష్ హెచ్చరించారు. చీరాల గ్రామీణ సెక్షన్‌లోని టౌన్-2 పరిధిలో బుధవారం విజిలెన్స్ అధికారులు ఆకస్మికంగా తనిఖీలు చేశారు. 36 బృందాలతో 2535 సర్వీసులను తనిఖీచేశారు. అదనంగా లోడ్ వాడుతున్న సర్వీసులకు రూ.1.36లక్షల అపరాధ రుసుం విధించినట్లు చెప్పారు. తనిఖీల్లో విద్యుత్ విజిలెన్స్ ఈఈ టి హైమావతి, వేటపాలెం డీఈ జె.శ్రీనివాసులు, పర్చూరు డీఈ రమేష్, 9మండలాల ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

బిబిహెచ్ పూర్వ విద్యార్థులకు అభినందనలు

ప్రజాశక్తి - వేటపాలెం

స్థానిక బండ్ల బాపయ్య హిందూ జూనియర్ కాలేజీలో చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు 1992బ్యాచ్ విద్యార్థులు ప్రథమ స్థానంలో ఉత్తీర్ణులైన పదిమందికి తమ వంతుగా రూ.60వేల ప్రోత్సాహంగా బుధవారం అందజేశారు. పూర్వ విద్యార్థి కొత్త వాసు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సహకారం ఎప్పుడూ ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమానికి చిట్ల కిరణ్, కంజుల నరసారెడ్డి, మొగిలి కోటయ్య, పెరుగు భాస్కర్, భార్గవ, కావూరి సురేష్, శిఖ నాగేశ్వరరావు, సుధీర్, పిట్టు సురేష్, సాంబశివరావు, చిలంకూరి శ్రీరామ్, వడ్డే శేషయ్య, పోలయ్య సహకారం అందించారు.

స్మశానవాటికను కేటాయించండి

ప్రజాశక్తి - వేటపాలెం

తమ కాలనీకి స్మశాన వాటికను కేటాయించాలని అబ్దుల్ కలాం కాలనీవాసులు ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తిని కోరారు. అబ్దుల్ కలాం కాలనీలో మౌలిక వసతులు కల్పించేందుకు జిల్లా హౌసింగ్ పిడి కెవిఎస్ ప్రసాద్‌తో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు తమకు మరుగుదొడ్లు కల్పించాలని కోరారు. అంగన్వాడి స్కూలును ఏర్పాటు చేయాలన్నారు. త్రాగునీటి వసతులు కల్పించాలని అన్నారు. కాలనిలో మౌలిక వసతులు కల్పించేందుకు అధికారులు సమిష్టిగా కృషి చేయాలని ఎమ్మెల్యే బలరాం అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పిడి జెవిఎస్ఆర్‌కెవి ప్రసాద్, ఈఈ శర్మ, డిఈ గోవిందరెడ్డి, ఏఈ సుబ్బారావు పాల్గొన్నారు.

బలరాంను స్మశాన వాటిక కోరుతున్న ప్రజలు

సమర యోధులను స్మరించుకోవాలి

ప్రజాశక్తి - చీరాల

స్వాతంత్రం కోసం పోరాడిన మహానుభావులను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని ఆర్డీవో సరోజినీ అన్నారు. మండలంలోని చీరాల నగర్‌లో ఆజాదీ కా అమృత్ మహోత్సవ కార్యక్రమంను ఆమె ప్రారంభించారు. మొక్కలు నాటి, జెండా వందనం, ప్రతిజ్ఞ కార్యక్రమాలను నిర్వహించారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు అన్ని పంచాయతీలలో ఈనెల 15వరకు అమృత మహోత్సవాలను నిర్వహించాలని సూచించారు. ఆమె వెంట తాసిల్దార్ జీవిగుంట ప్రభాకరరావు, ఎంపీడీవో నేతాజీ, మండల ప్రత్యేక అధికారి అబ్దుల్ సత్తార్, పంచాయతీ ప్రత్యేక అధికారి పవన్ కుమార్, కార్యదర్శి బి అనిల్ పాల్గొన్నారు. **చీరాల :** దేశ ఐక్యత, అభివృద్ధికి యువత పాటుపడాలని వైఏ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సీహెచ్ రమణమ్మ అన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ పి సుధారాణి పాల్గొన్నారు.

జెండా వందనం చేస్తున్న ఆర్‌డిఒ సరోజిని

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - చీరాల

అనారోగ్యంతో మతస్థిమితం లేక వ్యక్తి ఆత్మహత్యయత్నానికి పాల్పడిన ఘటన పట్టణంలోని విట్టల్ నగర్‌లో చోటు చేసుకుంది. విఠల్‌నగర్‌కు చెందిన ప్రకాష్ హొటల్లో పనిచేస్తుండగా భార్య పావని కంకర పనులకు వెలుతుంది. ప్రకాష అతిగా మద్యంతాగుతూ మతి స్థిమితం లేక ఆనారోగ్యానికి గురయ్యాడు. మంగళవారం అర్థరాత్రి ప్రకాష్ పెద్దగా కేకలు వేస్తుండటంతో బార్య పావని ఇంటి పక్కన వాళ్లను పిలిచేందుకు వెళ్లింది. ఆ సమయంలో ప్రకాష్ తలుపులు వేసుకుని దుప్పటితో దూలానికి ఉరి వేసుకున్నాడు. గమనించిన బార్య కిటికీలో నుంచి కత్తిపీటతో దుప్పటిని పట్టుకుని కోసే ప్రయత్నంలో ప్రకాష్ తల గోడకు తగిలింది. దీంతో తలకు గాయమైంది. వెంటనే 108లో చీరాలలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. ప్రస్తుతం చికిత్స పొందుతున్నాడు.

అన్ని రంగాల్లో ప్రభుత్వం వైఫల్యం

ప్రజాశక్తి - చీరాల

అన్ని రంగాల్లో వైసిపి ప్రభుత్వం విఫలమైందని టిడిపి ఇన్చార్జ్ ఎంఎం కొండయ్య అన్నారు. టిడిపి మహాశక్తి నిర్వహిస్తున్న మహిళలు, నాయకులను ఆయన అభినందించారు. వైసీపీని ప్రజలు అసహ్యించుకునే పరిస్థితికి వచ్చారని అన్నారు. టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అమలుచేసే పథకాలు, మినీ మేనిఫెస్టోలో పొందుపరిచిన ఆడబిడ్డ నిధి, తల్లికి వందనం, 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు, నిరుద్యోగ భృతి, ఇంటింటికి మంచినీటి సౌకర్యం కుళాయి, బీసీ రక్షణ చట్టం, అన్నదాత పథకంలను ప్రజలకు వివరించాలని అన్నారు. మినీ మేనిఫెస్టోను ప్రజలకు విస్తృతంగా వివరించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో రజిని, టిడిపి పట్టణ అధ్యక్షులు గజవల్లి శ్రీనివాసరావు, సుబ్బలక్ష్మి కోటి మోహన్, లావేటి శ్రీనివాస్ తేజ పాల్గొన్నారు.

పాఠ్య పుస్తకాలు లేకుండా చదువులు సాగేదెలా..?

- వేధిస్తున్న అధ్యాపకుల కొరత

- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

ఇంటర్మీడియట్ తరగతులు మొదలై నెల రోజులు దాటింది. నేటికీ విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందలేదు. అధ్యాపకులు సరిపడినంత మేర లేదు. దీంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడంలేదు. ప్రయివేటు కళాశాలల్లో విద్యా బోధన వేగం పుంజుకుంది. ప్రభుత్వ కళాశాలల్లో చదివే విద్యార్థులు మాత్రం దిక్కులు చూడాల్సిన పరిస్థితి నెలకొంది. పాఠ్యపుస్తకాలు బయట కొనుగోలు చేసుకోవాలని చెప్పడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. జూన్ 1 నుంచి ఇంటర్ తరగతులు ప్రారంభమయ్యాయి. పాఠ్యపుస్తకాలు సరఫరా చేయలేమని ప్రభుత్వం చేతులెత్తేసింది. మార్కెట్‌లో కొత్త పుస్తకాలు కొనాలంటే రూ.1500 నుంచి రూ.3 వేల వరకూ ఖర్చు అవుతుందని విద్యార్థులు వాపోతున్నారు.

పేద విద్యార్థులకు ఆర్థిక భారం..

జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు 25, మోడల్ స్కూళ్లు 6, హైస్కూల్ ప్లస్‌లు 10, కేజీబీవీ 28,

ఎపిఎస్‌డబ్ల్యూఆర్ 10, ఎపిటిడబ్ల్యూఆర్ 2 కళాశాలలు కలిసి మొత్తం 81 జూనియర్ కళాశాలలు ఉన్నాయి. వాటిలో 13,233 మంది విద్యార్థులు ఉన్నారు. పాఠ్యపుస్తకాలకు విద్యార్థులపై ఆర్థిక భారం పడుతోంది.

పెరిగిన ఫీజులు..

ప్రథమ సంవత్సరం ఎంపిసి, బైపిసి విద్యార్థులకు అన్ని రకాల ఫీజులతో కలిపి రూ.2,210, ఆర్ట్స్ గ్రూపులు (హెచ్ఐసి, సిఇసి) రూ.1,920, ఒకేషనల్ సాంకేతిక విద్యా కోర్సులకు రూ.2,434 వంతున ఫీజులు వసూలు చేస్తున్నారు. అడ్మిషన్ ఫీజు, రిజిస్ట్రేషన్ ఫీజు, దరఖాస్తు ఫీజు అదనంగా మరో రూ.1,500 అవుతుంది.

రాష్ట్ర ప్రభుత్వం పుస్తకాలు అందించాలి

చింతగుంట్ల వినోద్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి

కళాశాలలు ప్రారంభమై నెల దాటినా ఇప్పటివరకు పుస్తకాలు అందకపోవడంతో ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి విద్యార్థులకు పుస్తకాలు అందించాలి. లేకపోతే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఉద్యమాలకు సిద్ధమవుతాం.

చదువుకోవడం కష్టంగా ఉంది

షేక్ ఆసీమ్‌రాజ్, ఇంటర్ విద్యార్థి

పుస్తకాలు లేక చదువుకోవడం కష్టంగా ఉంది. పుస్తకాలు కొనుగోలు చేయడం మా తల్లిదండ్రులకు ఆర్థిక భారంగా మారింది. పాత పుస్తకాలు దొరకడం కష్టంగా ఉంది.

నేడు 'శిద్దా' జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-చీమకుర్తి

మాజీ మంత్రి శిద్దా రాఘవరావు జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించ డానికి అభిమానులు భారీ ఏర్పాట్లు చేశారు. ఉదయం 9గంటల నుంచి 10.30 వరకూ ఒంగోలులోని తన నివాసంలో శిద్దా అందుబాటులో ఉంటారు. 11గంటలకు చీకుమర్తిలోని హరిహరక్షేత్రంలో గోల్డెన్ గ్రానైట్ మేనేజర్ గిరిబాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. రిమ్స్ ఆసుపత్రికి వీల్‌చైర్స్ అందజేస్తారు. మధ్యాహ్నం 1గంట నుంచి 4 గంటల వరకు ఒంగోలు లోని ఆర్యవైశ్య భవనంలో నిర్వహించే సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. రాత్రి 6.30 గంటలకు లార్డ్ కృష్ణా బాడ్మింటన్ అకాడమీ కార్యక్రమాలలో పాల్గొంటారు.

మొక్కలు నాటుతున్న మేయర్ సుజాత

మొక్కలు నాటిన మేయర్

ఒంగోలు సబర్బన్ : 'మేరీ మట్టి -మేరా దేశ్' కార్యక్రమంలో భాగంగా నగర మేయర్ గంగాడ సుజాత 18వ డివిజన్ వెంగముక్కపాలెంలో బుధవారం మొక్కలు నాటారు. క్విస్ కాలేజీ ఎన్ఎస్-ఎస్ టీం ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఒడా చైర్మన్ శింగరాజు మీనా కుమారి, వైసిపి నాయకులు వెంకటేశ్వరరెడ్డి, అంజిరెడ్డి, తిరుమలరెడ్డి, కె.ఏడుకొండలు, కుమార్, అశోక్, చింటు, మురళి, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-వెలిగండ్ల

గ్రామ, వార్డు, సచివాలయాలు, వాలంటీర్ల వ్యవస్థ ద్వారా ఇంటిముంగిటకే ప్రభుత్వ సేవలు అందిస్తున్నట్లు కనిగిరి ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్ తెలిపారు. మండల పరిధిలోని మొగులూరు ఎస్‌సి కాలనీలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం బుధవారం నిర్వహించారు. తొలుత సచివాలయంలో ఎంపిడిఒ తాతపూడి సుకుమార్ ఆధ్వర్యంలో వాలంటీర్లు, సచివాలయ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచి మోపూరి లక్ష్మి, ఎంపిటిసి పూనూరి స్వప్నా ఎమ్మెల్యేను, ఎంపీపీ రమణ మహాలక్ష్మిని సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి నాలుగేళ్ల కాలంలో ప్రభుత్వం అందజేసిన సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. అదే విధంగా వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో ప్రతి నెల ఒకటో తేదీన పెన్షను అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రామన మహాలక్ష్మి, మాజీ జడ్‌పిటిసి రామన తిరుపతిరెడ్డి, సర్పంచి మోపురి లక్ష్మి, వైసిపి నాయకులు నాగూర్‌యాదవ్, రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ పెరుగు, సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు పొల్లా సుబ్రహ్మణ్యం, మురళీకష్ణ, సింగివిండో అధ్యక్షుడు కాకర్ల వెంకటేశ్వర్లు, తాతపూడి దేవ సహాయం, కన్వీనర్ గజ్జల వెంకటరెడ్డి, కొప్పనబోయిన వెంకటరామయ్య, గంజి రవీంద్రారెడ్డి, ఎంపిటిసి పూనూరి స్వప్న, సూరపరెడ్డి ఆదినారాయణరెడ్డి, కర్నాటి వెంకటేశ్వర్లు, ఆవుల నారాయణరెడ్డి, గూడూరి అనిల్‌బాబు, సర్పంచి తాతపూడి సురేష్‌బాబు, తాతపూడి నాని పాల్గొన్నారు.

స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుర్రా

రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన

ఒంగోలు సబర్బన్ : స్థానిక 50వ డివిజన్ నేతాజీ నగర్‌లో రూ.65 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సిమెంట్ రోడ్ల నిర్మాణానికి నగర మేయర్ గంగాడ సుజాత బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగర పరిధిలో అభివృద్ధి పనులకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ప్రధానంగా మురుగుకాలువల నిర్మాణం, రహదారులను ప్రాధాన్యత క్రమంలో నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఒడా చైర్మన్ శింగరాజు మీనా కుమారి,స్థానిక కార్పొరేటర్ అంబటి ప్రసాదరావు, కార్పొరేషన్ ఇంజినీర్ కె మాల్యాద్రి, డిఇ గణపతి, వైసిపి నాయకులు జెల్లిపల్లి సురేష్, ఏడు కొండలు, కండె రాములు తదితరులు పాల్గొన్నారు.

జాడలేని వర్షం.. సాగు కాని పంటలు..

- ముగుస్తున్న ఖరీఫ్ సీజన్ - రైతుల్లో ఆందోళన

ప్రజాశక్తి-పిసిపల్లి

ఖరీఫ్ సీజన్ ముగుస్తున్నప్పటికీ ఇంత వరకూ దుక్కులు కూడా దున్నలేదు. రైతులు వర్షం కోసం ఎదురు చూస్తున్నారు. ఖరీఫ్ సీజన్ జూన్‌లో ప్రారంభమై ఆగస్టుతో ముగుస్తుంది. గతంలో ఆగస్టు నాటికి కంది పంట సాగు చేసి అగుడు ఎత్తు మొక్కలు వచ్చేవి. ఈ ఏడాది అసలు కందే సాగు చేయలేదు. గతంలో కురిసిన వర్షాలకు మండలం మొత్తం మీద 100 ఎకరాల్లో దుక్కులు దున్నారు. పొలంలో తేమ శాతం లేక విత్తనాలు విత్తలేదు. మండలంలో ఖరీఫ్ సీజన్‌లో సుమారు 20 వేల ఎకరాల్లో కంది, మినుము, పెసర పంటలు సాగు చేస్తారు. గత సంవత్సరం పంటలు సాగు చేసిన తరువాత వర్షాలు లేక దిగుబడి తగ్గింది. మండల పరిధిలోని పిసిపల్లి, మారేళ్ళ, ఒరిమడుగు, బట్టుపల్లి, అలవలపాడు, తలకొండపాడు, ముద్దపాడు పంచాయతీల్లో కంది సాగు చేస్తారు. గుంటుపల్లి, పెదఇర్లపాడు, లక్ష్మక్కపల్లిలో మినుము పంటను సాగు చేస్తారు. గత నాలుగు రోజులుగా వేసవిని తలపించే ఎండలు కాస్తున్నాయి. వానలు లేక ఖరీఫ్ సీజన్ ముందుకు సాగక సుమారు 20వేల ఎకరాల్లో సాగుకు నోచలేదు.

వర్షం లేక బీడుగా మారిన భూమి

ఆత్మీయునికి అశ్రునివాళి

కీ॥శే॥ మీసాల వెంకటేశ్వర్లు గారు
జననం: 14-01-1951 మరణం : 29-07-2023
రేషన్ డీలర్, ఊళ్ళపాలెం, సింగరాయకొండ (మండలం), ప్రకాశం జిల్లా.

స్నేహశీలి.. నిగర్వి... మంచితనం మూర్తీభవించిన మంచిమనిషి....
మాకు అత్యంత ఆప్తులు ఆత్మీయులు కీ॥శే॥ మీసాల వెంకటేశ్వర్లు గారి
అకాల మరణం మమ్మల్ని కలచివేసింది. వారి అకాల మరణానికి చింతిస్తూ....
వారి కుటుంబ సభ్యులకు మా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాము....

రేషన్ డీలర్స్ అసోసియేషన్ - సింగరాయకొండ
ప్రకాశం జిల్లా

విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

విజేతలకు బహుమతులు అందజేత

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

పెద్దదోర్నాలలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హిరోషిమా, నాగసాకి దినోత్సవాల సంధర్భంగా బుధవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వి నారాయణరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పలు అంశాలపై పోటీలను నిర్వహించారు. పాటల పోటీలలో సీనియర్స్ విభాగం హిమ బృందం, రజియ బృందం, రామ్‌చరణ్ నాయక్, జూనియర్స్ విభాగంలో నాగవంశి మాధవ్, ఖాజాబి బృందం, కృష్ణవేణి బృందం, చిత్రలేఖనం సీనియర్స్ విభాగంలో భార్గవి, ఆస్మా, రామ్ చరణ్ నాయక్, స్వాతి, దుర్గా ప్రసాద్ నాయక్, జూనియర్స్ విభాగంలో నాగవంశి మాధవ్, జన్మత్, రామకృష్ణ, వకృత్వం సీనియర్స్ విభాగంలో వర్షిత, శిరీష, కోమలి, జూనియర్స్ విభాగంలో నాగవంశి మాధవ్, మధుప్రియ, శిరీష, కోమలి విజేతలుగా నిలిచారు. వీరికి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కమిటి చైర్మన్ వెంకటేశ్వరరెడ్డి, ఉపాధ్యాయులు వి నాగమూర్తి, కిరణ్ కుమార్, అనసూయా దేవి, వెంకటశివ, విజయ మాణిక్యం, పోలయ్య, శిరీషారాణి, ఆవులయ్య, మీటే నాయక్, రామా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పలకలు పంపిణీ చేస్తున్న పత్తి వెంకటసుబ్బారావు

పలకలు నోట్ బుక్స్ పంపిణీ

ప్రజాశక్తి వేటపాలెం

ప్రాథమిక విద్యకు ప్రోత్సాహకం, ఉన్నత విద్యావంతులకు సహకారం పర్యావరణ పరిరక్షణ ధ్యేయంగా పట్టభద్రుల సంఘం పనిచేస్తుందని అధ్యక్షులు ప్రతి వెంకట సుబ్బారావు తెలిపారు. బుధవారం మండల పరిధిలోని దేశాయిపేట పంచాయతీ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పలకలు పంపిణీ చేశారు పాఠశాలలో చదువుకొని ఉన్నత విద్యాభ్యాసనకు విదేశాలకు వెళుతున్న ఆ ప్రాంత మధ్యతరగతి కుటుంబం నుండి వచ్చిన కుమారి లక్కాకుల ధరణి ఈ స్థాయికి ఎదగటం ఎంతో సంతోషించదగ్గ విషయము అన్నారు. చిన్నారులు అందరూ కూడా కుమారి ధరణిని ఆదర్శంగా తీసుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని క్రమశిక్షణను అలవర్చుకోవాలని ఆకాంక్షించారు ఈ సందర్భంగా కుమారి ధరణిని సంఘం తరుపున చిరు సత్కారం చేసినారు. అధ్యాపకులు, ఈ కార్యక్రమంలో సంఘ కార్యదర్శి సుంకర వెంకటలక్ష్మి ప్రసాద్ పాఠశాల ప్రధాన అధ్యాపకురాలు శ్రీమతి మల్లేశ్వరి, జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధాన అధ్యాపకురాలు విజయలక్ష్మి, పాఠశాల సిబ్బంది శ్రీహరి, శివ పార్వతి, సభ్యులు చుండూరు మురళీకష్ణ, మస్తాన్ రెడ్డి కుమార్ తదితర ఉపాధ్యాయ బందం గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నగదు పంపిణీ

ప్రజాశక్తి -యద్దనపూడి

మండలంలోని యనమదల గ్రామములో బుధవారం కటకం శెట్టి సామ్రాజ్యంకు రూ.10వేలు నగదును అందజేశారు. సామ్రాజ్యం కుమారుడు అన్నారోగ్యంతో మృతి చెందాడు. మృతునికి వై.యస్.ఆర్ భీమా ఉండడంతో తక్షణ సహాయంగా నగదు అందజేశారు. ఈ సందర్భంగా యద్దనపూడి యం.డి.ఒ కష్ణ కుమారి మాట్లాడుతూ అర్హులకు ప్రభుత్వ పథకం అందించడం జరుగుతుంది అన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాణి, వెల్ఫేర్ అసిస్టెంట్ బాజీ, గ్రామ నాయకుడు శ్రీధర్, వాలంటీర్ శిరీష తదితరులు పాల్గొన్నారు.

హ్యాపీ ఆర్ఫన్ హోమ్ ఏర్పాటు అభినందనీయం

ట్రైనీ ఐపిఎస్ అంకిత సురాణ

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

జోసెఫ్ ఎడ్యుకేషనల్ డెవలప్మెంట్ సొసైటీ ఏర్పాటు చేసి అనాథలకు ఆసరా నిలిచిన బుదాల ప్రదీప్, సురేష్‌లను ఆదర్శంగా తీసుకొని ప్రతి ఒక్కరూ ఇతలకు సహాయ పడాలని మార్కాపురం గ్రామీణ పోలీస్ సేష్టన్ ఎస్‌హెచ్‌ఓ, శిక్షణ ఐపీఎస్ అధికారి అంకిత సురాణ మహమీర్ పేర్కొన్నారు. బుధవారం మండలం రాయవరం గ్రామంలో ఉన్న అనాధలను ఆదుకోవాలి అనే మంచి సంకల్పంతో అనాథ పిల్లల ఆశ్రమమును జోసెఫ్ ఎడ్యుకేషనల్ డెవలప్మెంట్ సొసైటీ పేరిట ఏర్పాటు చేసి హ్యాపీ ఆర్ఫన్ హోమ్‌ను ఎస్‌హెచ్‌ఓ, శిక్షణ ఐపీఎస్ అధికారి అంకిత సురన మహమీర్ ప్రారంభించారు. ఈ

పేద మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న అంకిత సురాణ

సందర్భంగా ఆమె మాట్లాడుతూ అనాధ పిల్లలకు సేవ చేయాలనే మంచి ఉద్దేశ్యంతో ఇలాంటి ఆశ్రమాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ ఆశ్రమానికి ఎప్పుడు కూడా తన సహాయ సహకారాలు అందించడానికి సిద్ధంగా ఉన్నారు. అనాథ పిల్లలను ఆదుకోవడం చాలా మంచి ఆలోచన, తల్లితండ్రులు ఉన్నవారే పిల్లలను సరిగా చూసుకోలేని పరిస్థితుల్లో ఇలా అనాధాశ్రమమును ప్రారంభించి ఇతరులకు ఆదర్శంగా నిలిచిన బుదాల ప్రదీప్, సురేష్‌లను అమె అభినంధించారు. అనంతరం పలువురు పేద మహిళలకు చీరల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా నాయకులు వేశపోగు సుదర్శన్, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు ప్రకాష్, దళిత బహుజన సేన రాష్ట్ర అధ్యక్షులు కిషోర్ కుమార్, సర్పంచ్ గుడ్డెపోగు రమేష్, కొమరోలు గురుబాబు, వినుకొండ రమేష్, బూదాల బాల చెన్నయ్య, బిచ్చాల సాల్మన్ తదితరులు పాల్గొన్నారు.

'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమం ప్రారంభం

తపాలా శాఖలో అందుబాటులో జాతీయ జెండాలు

కె.శ్రీనివాస్, పోస్టల్ సూపరింటెండెంట్

ప్రజాశక్తి-మార్కాపురం

కేంద్ర ప్రభుత్వం తపాలా శాఖ ద్వారా చేపట్టిన హర్ ఘర్ తిరంగా కార్యక్రమం బుధవారం ప్రారంభమైంది. ఈ విషయాన్ని మార్కాపురం డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ కె.శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీ వరకు హర్ ఘర్ తిరంగాలో భాగంగా ప్రతి ఇంటిపైన మన జాతీయ జెండాను ఎగరవేయాలని కోరారు. ప్రతి పోస్ట్ ఆఫీసులో జాతీయ జెండాలు అందుబాటులో ఉన్నాయని, అందుకు గాను ప్రతి జాతీయ జెండాను ఒక్కొక్కటి రూ.25/- చెల్లించి పొందవచ్చని వివరించారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరు జాతీయ జెండాను ఇంటిపైన ఎగురవేయాలని తెలియజేశారు. అంతే కాకుండా ఈ జాతీయ జెండాలను ఆన్‌లైన్‌లో కూడా బుక్ చేసుకొనే సదుపాయం అందుబాటులో ఉందన్నారు. కావున అందరు ఈ సదవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు.

విద్యార్థులు నామినేషన్లు నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తి-పర్చూరు

ప్రస్తుత విద్యాసంవత్సరానికి ఇన్‌స్పైర్ అవార్డులకు జిల్లాలోని విద్యార్థులు నామినేషన్లు నమోదు చేసుకోవాలని పర్చూరు ఉప విద్యాశాఖాధికారి ఆర్.శ్రీనివాసరావు తెలిపారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో పర్చూరు ఎ.ఆర్.హైస్కూల్ ఆవరణలో బుధవారం, పాఠశాలల ఉపాధ్యాయులకు ఇంటింటా ఇన్నోవేటర్, ఇన్‌స్పైర్ నామినేషన్ల ప్రక్రియపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో డీవైఈవో ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. పాఠశాల స్థాయి నుండే విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయడానికి కేంద్ర శాస్త్ర సాంకేతిక మంత్రిత్వశాఖ ఏటా ఇన్‌స్పైర్ అవార్డ్స్ మనక్ పోటీలను నిర్వహిస్తోందన్నారు. విద్యార్థులు తమ ప్రాజెక్ట్‌లను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవడానికి గడువు ఆగస్టు 25 వరకు ఉందన్నారు. జిల్లాలోని అన్ని యాజమాన్యాల ప్రాథమికోన్న త, ఉన్నతపాఠశాలల్లో 6నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యా ర్థులు తమ వివరాలు, బ్యాంకు ఖాతా, ఆధార్, వారి ప్రాజెక్ట్ వివరాలను ఇన్స్పైర్ మనక్ వెబ్‌సైట్‌లో ఇప్పటికే రిజిస్ట్రేషన్ చేసుకున్న తమ పాఠశాల లాగిన్ ద్వారా గడువులోపు నమోదు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి మహమ్మద్ సాదిక్, ప్రధానోపాధ్యాయులు ఈదర రాజశేఖర్, జిల్లా నేషనల్ గ్రీన్ కోర్ కో ఆర్డినేటర్ పవని భాను చంద్ర మూర్తి, ప్రభుత్వ యాజమాన్యంలోని అన్ని ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ నులిపురుగుల నివారణా దినోత్సవం

ప్రజాశక్తి-పిసిపల్లి

కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గురువారం మండలంలోని అన్ని ప్రభుత్వ మరియు ప్రైవేటు పాఠశాలలు, అంగన్‌వాడి కేంద్రాలలో జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం నిర్వహించనున్నట్లు వైద్యాధికారులు తెలిపారు. నులిపురుగుల నివారణకు ఉద్దేశించిన ఈ కార్యక్రమానికి సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. ఇప్పటికే అన్ని పాఠశాలలకు అబెండ జోల్ మాత్రలను సరఫరా చేసినట్లు తెలిపారు. వైద్య, ఆరోగ్య సిబ్బంది ఆధ్వర్యంలో ఈ మాత్రలను విద్యార్థులు వినియోగించుకునేలా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పంచాయతీ, అంగన్‌వాడి, వైద్య, విద్యాశాఖ సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి తగిన ఏర్పాటు చేసినట్లు మండల వైద్యాధికారి ఎఎన్.రాజ్యలక్ష్మి, ఎంపిడిఓ కె.శ్రీనివాసులురెడ్డిలు తెలిపారు.

జూనియర్ కాలేజీ ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-కొనకనమిట్ల

మండల కేంద్రం కొనకనమిట్లలో జూనియర్ కాలేజి ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. భౌగోళికంగా చూస్తే జిల్లాలోనే పెద్దమండలమైన కొనకనమిట్లలో 26 పంచాయతీలు, 34 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. 42 వేలకు పైగా జనాభా ఉన్నారు. ప్రతి ఏటా మండలంలో సుమారు 500 మంది 10వ తరగతి పాసై పట్టణాలలో ఇంటర్మీడియట్ చదువుకొనేందుకు వెళ్తున్నారు. ఆర్థిక స్తోమత లేనివారు చదువు మానేస్తున్నారు. గతంలో గ్రామస్తులు పలుమార్లు అధికారులకు దృష్టికి తీసుకెళ్ళారు. పాలకులు, అధికారులు నిర్లక్ష్య ధోరణి వల్లే కాలేజి ఏర్పాటుకు నోచుకోలేదని విద్యార్థుల తల్లిదండ్రులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ఈ ప్రాంతం ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి మండల కేంద్రంలో జూనియర్ కాలేజి ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

గరిష్ఠ ధర కిలో రూ.282

ప్రజాశక్తి-కొండపి

కొండపి పొగాకు వేలం కేంద్రంలో బుదవారం నాడు గరిష్ఠ ధర కిలో రూ.282 పలికిందని వేలం నిర్వహణాదికారి ఎస్.రామారావు తెలిపారు. వేలం కేంద్రానికి చోడవరం, ముప్పవరం గ్రామాలకు చెందిన రైతులు 1219 పొగాకు బేళ్లను అమ్మకానికి ఉంచారు. అందులో 1178 బేళ్ల అమ్ముడుపోగా మిగిలిన 41 బేళ్ల వివిద కారణాల చేత ఇంటికి తిరుగుముఖం పట్టాయి. గరిష్ఠ ధర కిలో రూ.282, కనిష్ఠధర కిలో రూ.150, సరాసరి ధర కిలో రూ.266.04 పలికిందన్నారు.

శిలాఫలకం ఆవిష్కరణ

ప్రజాశక్తి-పర్చూరు

మండలం పరిధిలోని చెరుకూరులో పంచాయతీ కార్యాలయం వద్ద "నా భూమి, నా దేశం, నేలతల్లికి నమస్కారం, వీరులకు వందనం" శిలాఫలకాన్ని ఏర్పాటు చేశారు. గ్రామ సర్పంచ్ పేరం సుబ్బారావు శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈసందర్భంగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించడం, గ్రామంలో మొక్కలు నాటడం కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈకార్యక్రమంలో వైస్ ఎంపిపి పాలేరు వీరయ్య, ఉప సర్పంచ్ గడ్డం గోపి,పంచాయతి కార్యదర్శి సత్యనారాయణ, ఏపీవో బుల్లిబాబు, నాయకులు కాలేష, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వసుదాకి వందనం

ప్రజాశక్తి-కొండపి

మండలంలోని చినకండ్లగుంట పంచాయతీలో వసుదాకి వందనం కార్యక్రమం నిర్వహించినట్లు ఏపివో మహాలక్ష్మి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన వసుదాకి వందనం కార్యక్రమం ద్వారా గ్రామాలలో నేలతల్లికి ఎలా కాపాడుకోవాలని మేరా దేశ్, మేరా భూమి అనే నినాదం గురించి గ్రామస్తులకు వివరించారు. ఈ కార్యక్రమం ఈనెల 10న గుర్రపడియ, నెన్నూరుపాడు, ఇలవర, కొండపి పంచాయతీల్లో, 11న చినవెంకన్నపాలెం, చోడవరం, పెట్లూరు, పెదకండ్లగుంట పంచాయతీల్లో, 12న వెన్నూరు, ముప్పవరం, పెరిదేపి, మిట్టపాలెం, ముప్పరాజుపాలెం పంచాయతీల్లో, 14న కె.ఉప్పలపాడు, కట్టుబడిపాలెం, గోగినేనివారిపాలెం, మూగచింతల, అనకర్లపూడి పంచాయతీల్లో వసుదాకి వందనం కార్యక్రమం నిర్వహిస్తారని తెలిపారు.

ప్రకృతిని పరిరక్షించాలి

బాపట్ల ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షులు శ్రీనివాసరావు

ప్రజాశక్తి - బాపట్ల

స్థానిక పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో ఏఐసిటిఈ చెట్ల పెంపకంలో భాగంగా 400కుపైగా మొక్కలు నాటారు. బాపట్ల ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షులు ముప్పలనేని శ్రీనివాసరావు మాట్లాడుతూ పర్యావరణాన్ని ప్రతి ఒక్కరూ బాధ్యతతో పరిరక్షించాలని కోరారు. విద్యార్థులు భాగస్వామ్యం కావాలని కోరారు. కార్యదర్శి మానం నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రకృతిని మనము రక్షిస్తే, ప్రకృతి మనల్ని రక్షిస్తుందని అన్నారు. మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించాలని అన్నారు. కాలేజీ ప్రిన్సిపాల్ టి రాజేంద్రప్రసాద్, వైస్ ప్రెసిడెంట్స్ దొప్పలపూడి రామ్మోహన్రావు, గెల్లి దిలీప్ కుమార్, సంయుక్త కార్యదర్శి, కరస్పాండెంట్ కొమ్మినేని హరి పద్మ ప్రసాద్, ట్రెజరర్. తాళ్లూరి రామకృష్ణ పాల్గొన్నారు.

మొక్కలు నాటుతున్న ముప్పలనేని శ్రీనివాసరావు

పంగులూరు : మండలంలోని నూజిల్లపల్లి గ్రామ ప్రజలు నామట్టి - నాభూమి ప్రమాణం చేశారు. స్థానిక ప్రాథమికోన్నత పాఠశాలలో ఆజాదీకా అమృత మహోత్సవ్ కార్యక్రమం బుధవారం జరిగింది. స్వాతంత్ర్య వీరులను స్మరించుకున్నారు. ప్రధానీ నరేంద్ర మోడీ, సిఎం వైయస్ జగన్మోహన్ రెడ్డి సందేశాల శిలాఫలకాన్ని పాఠశాల ఆవరణలో ఆవిష్కరించారు. గ్రామంలో మట్టిని సేకరించి ప్రజలు, అధికారులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ జ్యోతి ప్రసాద్ బాబు, సర్పంచి మద్దినేని పార్వతమ్మ, పంచాయతీ సెక్రెటరీ వందనం, హెచ్ఎం కేమా వీరాంజనేయులు పాల్గొన్నారు.

చెరుకుపల్లి : దేశానికి సేవ చేసిన వీరులను స్మృతించుకుంటూ వారి సేవలను నేటి తరానికి తెలియజేయాలని ఎంపిడిఒ బి శ్రీనివాసరావు కోరారు. వివిధ గ్రామాలలో మొక్కలు నాటారు. శిలాఫలకాలు ఆవిష్కరించి ర్యాలీలు నిర్వహించారు. కుంచాలవారిపాలెం, కనగాల, రాంబొట్లపాలెం, కావూరు, తూర్పుపాలెం గ్రామాలలో పలువురు అధికారులు, ప్రజా ప్రతినిధులు మొక్కలు నాటారు.

బల్లికురవ రూరల్ : నా మట్టి– నా దేశం కార్యక్రమంలో భాగంగా కొణిదెన పంచాయతీలో శిలాఫలకం అంకితం, పంచ్ ప్రతిజ్ఞ, మొక్కలు నాటడం, ర్యాలీ, వీరులకు, జెండాకు వందనం, జాతీయ గీతం ఆలాపన జరిగింది. అమరవీరుల కుటుంబసభ్యులు జంద్రాజుపల్లి యేసు, కొమ్మాలపాటి జక్రయ్య శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు చింతల పేరయ్య, ప్రత్యేక అధికారి ఎంపీడీవో సిహెచ్ కృష్ణ, ఎంఈఓ కాకాని రమేష్, పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న కృష్ణచైతన్య

అభివృద్ధి పనులకు భూమి పూజ

ప్రజాశక్తి - అద్దంకి

మండలంలోని శంఖవరప్పాడులోని విద్యుత్ సబ్ స్టేషన్ నందు అభివృద్ధి పనులకు ఎపి శాప్‌నెట్ ఛైర్మన్, వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బాచిన కృష్ణచైతన్య భూమిపూజ చేశారు. శంఖవరప్పాడు, కలవకూరు, ధర్మవరం, సింగరకొండపాలెం గ్రామాలకు నాణ్యమైన విద్యుత్ 24గంటలు ఇచ్చేందుకు, 5వేలకు పైబడిన జనాభా ఉన్న పంచాయతీలకు త్రీఫేస్ సప్లై సౌకర్యం కోసం రూ.7.6కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టారు. 2400 కరెంట్ స్తంభాలు, 19/100 కెవిఎ ట్రాన్స్ఫార్మర్లు ఏర్పాటు చేయనున్నారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు డీవార్మింగ్ రెండో విడత

ప్రజాశక్తి - అద్దంకి

మోదేపల్లి పిహెచ్‌సి పరిధిలోని 11వ సచివాలయం నందు 39 ప్రభుత్వ, మూడు ప్రైవేటు పాఠశాలలు, 38 అంగన్వాడీ కేంద్రాలలోని పిల్లలకు నులి పురుగుల నివారణ మందులను మధ్యాహ్న భోజనం అనంతరం మింగించనున్నట్లు వైద్యాధికారి ఎన్ జయచంద్రరావు తెలిపారు. గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నులి పురుగు రహిత ఆంధ్ర ప్రదేశ్‌గా తీర్చిదిద్దాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. 900మంది పాఠశాల విద్యార్థులకు, 1256మంది అంగనవాడీ బాల, బాలికలకు ఆల్బెండజోల్ మాత్రలు మింగించే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పంటల బీమాపై శిక్షణ

ప్రజాశక్తి - అద్దంకి

పంటల భీమాకి పంట కోత ప్రయోగాలే కీలకమని ఎఒ కొర్రపాటి వెంకటకృష్ణ తెలిపారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో గ్రామ వ్యవసాయ సహాయకులకు పంట కోత ప్రయోగాలపై శిక్షణ నిర్వహించారు. అద్దంకి సహాయ గణాంకాధికారి అమర్నాథ్ మాట్లాడుతూ గ్రామ స్థాయిలో పంట కోత ప్రయోగాలు ఖచ్చితంగా అమలు చేయడం వలన ఖచ్చితమైన దిగుబడులు అంచనా వేయవచ్చని తెలిపారు. సంతమాగులూరు సహాయ గణాంకాధికారి సుబ్రమణ్యం మాట్లాడుతూ పంట కోత ప్రయోగాలు చేసే విధానం ప్లాట్ ఎంపిక, ఫారం 1, 2, 3పంపే విధానం తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామం వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

జాతీయ జెండాల విక్రయం

ప్రజాశక్తి - బాపట్ల

హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరు ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలని ఇచ్చిన కార్యక్రమంలో భాగంగా అందరికీ అందుబాటులో హెడ్ పోస్టాఫీసులో జాతీయ జెండాల విక్రయాలు చేస్తున్నారు. ఈనెల 13 నుండి ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగరవేసి భారతావని మనకు అందించిన స్వాతంత్ర్య ఫలాలను చాటి చెప్పాలని అన్నారు. జండాను రూ.25లకు అందజేశారు. పోస్టల్ సిబ్బంది చేపట్టిన కార్యక్రమంలో ఫోరం ఫర్ బెటర్ సభ్యులు పాల్గొన్నారు.

నగదు అందజేస్తున్న ఎంపిడిఒ, సిబ్బంది

బీమా నగదు పంపిణీ

ప్రజాశక్తి - యద్దనపూడి

యనమదలలో కటకంశెట్టి సామ్రాజ్యంకు రూ.10వేల నగదును బుధవారం అందజేశారు. సామ్రాజ్యం కుమారుడు అనారోగ్యంతో మృతి చెందాడు. మృతునికి వైయస్ఆర్ భీమా ఉండడంతో తక్షణ సహాయంగా నగదు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ కృష్ణ కుమారి మాట్లాడుతూ అర్హులకు ప్రభుత్వ పథకం అందించడం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాణి, వెల్ఫేర్ అసిస్టెంట్ బాజీ, గ్రామ నాయకుడు శ్రీధర్, వాలంటీర్ శిరీష పాల్గొన్నారు.

రైతులకు వైసిపి తీరని ద్రోహం

ప్రజాశక్తి - బాపట్ల

ఎండిన పంటలు చూస్తున్న వర్మ

చెరువు జమ్ములపాలెంలో టిడిపి ఇన్‌ఛార్జి వేగేశన నరేంద్రవర్మ పర్యటించారు. రైతుల కష్టాలను అడిగి తెలుసుకున్నారు. రైతులతో కలిసి ఎండిన పొలాలను పరిశీలించారు. తక్షణమే రైతులకు పట్టిసీమ నీటిని వదలాలని సిఎం జగన్‌ను, ఎమ్మెల్యే కోన రఘుపతిని డిమాండ్ చేశారు. రైతులు ఎండిన పంటలను వర్మకు చూపి తమ కష్టాలు చెప్పుకున్నారు. ఆగస్టు వచ్చినా నీళ్ల వదలక పోవడం వలన పంట ఎండిపోయి కలుపుతో తీరని నష్టం జరుగుతుందన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి కాలువ పూడిక తీసి నీళ్ల ఇచ్చి రైతులను ఆదుకోవాలని కోరారు. ఈ పర్యటనలో టిడిపి మండల అధ్యక్షులు ముక్కమల శివ, టిడిపి నాయకులు చెన్నుపాటి కిషోర్, బండి సుబ్బరామాయ్య, కొమ్మినేని శ్రీనివాసరావు, అక్కి రామారావు, రైతులు మెట్ల అంకమ్మ, లోఖనాదం, అత్తెటి ఉదయ్ కుమార్, కుర్ర దిలీప్ కుమార్, ఇంటూరి రాంబాబు, మురళి కృష్ణ, నరేష్, పురుషోత్తం పాల్గొన్నారు.

ఆదివాసీలకు ఉపాధి కల్పించాలి

ప్రజాశక్తి - అద్దంకి

స్వాతంత్రం వచ్చి 75 ఏళ్ల దాటిన నేటికీ ఆదివాసి కుటుంబాలు తిండి కోసం వలసలు పోవాల్సి వస్తుందని, వీరు విద్యా, వైద్య సదుపాయాలు, ఉపాధి లేక దుర్భర జీవితాన్ని అనుభవిస్తున్నారని దళిత బహుజన రిసోర్స్ సెంటర్ రీజినల్ కో–ఆర్డినేటర్ దార్ల కోటేశ్వరరావు అన్నారు. మండలంలోని సింగరకొండపాలెం యానాది సంఘంలో జరిగిన అంతర్జాతీయ ఆదివాసి హక్కుల దినోత్సవం సభలో ఆయన మాట్లాడారు. ఆదివాసీ హక్కులు కాపాడాలని కోరారు. యానాది సేవా సంఘం జిల్లా కార్యదర్శి మేకల ఆదినారాయణ మాట్లాడుతూ గిరిజన కులాల చెందిన యానాదులు ఇల్లులేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. విద్యా, వైద్య సౌకర్యాలు కల్పించి మెరుగైన జీవనం కోసం అధికారులు పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో యానాది సేవా సంఘం నాయకులు ఉబ్బాని నాగరాజు, ఇండ్ల వేణు పాల్గొన్నారు.

సిమెంటు రోడ్లకు శంకుస్థాపన

ప్రజాశక్తి - చెరుకుపల్లి

శంకుస్థాపనచేస్తున్న ఎమ్మెల్యే

గ్రామ అభివృద్ధికి ఇచ్చిన హామీ మేరకు రూ.70లక్షల సొంత నిధులతో సిమెంట్ రోడ్లు వేయడం హర్షించదగ్గ విషయమని రేపల్లె ఎంఎల్ఎ అనగాని సత్య ప్రసాద్ అన్నారు. బలుసులపాలెంలో 7 సీసీ రోడ్లను రూ.70లక్షల నిధులతో నిర్మించేం దుకు బుధవారం భూమి పూజ చేశారు. ఈ రోడ్లకు ఎమ్మెల్యే రూ.10లక్షల ఆర్థిక సహకారం అందించగా, మిగిలిన రూ.60లక్షల నిధులను సర్పంచ్ కొనకాల నాగమల్లేశ్వరి తన సొంతంగా సమకూర్చారని అన్నారు. కార్యక్రమంలో టిడిపి గ్రామ అధ్యక్షుడు పేరం శంకర్ బాబు పాల్గొన్నారు.

క్విట్ మోడీ - సేవ్ ఇండియా

ప్రజాశక్తి - బాపట్ల

మాట్లాడుతున్న సిహెచ్ మజుందార్

క్విట్ ఇండియా దినోత్సవం సందర్భంగా సిఐటియు ఆధ్వర్యంలో బాపట్లలోని పాత బస్టాండు నందు కేంద్ర ప్రభుత్వ విధానాలపై నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ మజుందార్ మాట్లాడుతూ 1942 ఆగస్టు 9న ఆనాటి బ్రిటిష్ వాళ్ళను దేశం నుండి వెళ్లిపోవాలని మహాత్మా గాంధీ క్విట్ ఇండియా ఉద్యమానికి పిలుపు ఇచ్చారని అన్నారు. నేడు ప్రజావ్యతిరేక కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న నరేంద్ర మోడీ నుండి దేశాన్ని కాపాడాల్సిన అవసరం ఉందని అన్నారు. పోరాడి సాధించుకున్న హక్కులు కాపాడుకోవాలంటే క్విట్ మోడి, క్విట్ బిజెపి, సేవ్ ఇండియా నినాదాలతో మరో ఉద్యమం చేయాల్సి ఉందని అన్నారు. లౌకిక భారతంలో మతోన్మాదాన్ని రెచ్చగొట్టి ఓట్ల కోసం రాజకీయాలు చేస్తుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు బుచ్చిరాజు, కిషోర్ శ్రీనివాసరావు, జకరయ్య పాల్గొన్నారు.

మార్టూరు రూరల్ : మతతత్వ బిజెపి నుండి దేశాన్ని కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరు ముందుకు రావాలని రైతు సంఘం జిల్లా నాయకులు కందిమళ్ల రామకోటేశ్వరరావు కోరారు. మార్టూరులోని కొణిదెన రోడ్డులోని ఎఎంసి మార్కెట్ యార్డ్ నుండి స్థానిక స్టేట్ బ్యాంకు మీదుగా నిర్వహించారు. ఈ సందర్భంగా కందిమళ్ల రామకోటేశ్వరరావు, సిఐటియు నాయకులు బత్తుల హనుమంతరావు మాట్లాడుతూ ఆనాడు బ్రిటిష్ వాళ్ళని దేశం నుండి తరిమికొట్టడానికి క్విట్ ఇండియా ఉద్యమం నిర్వహించారని కోరారు. నేడు దేశ ప్రజల ఆస్తుల్ని, ప్రభుత్వ రంగాన్ని కార్పొరేట్ శక్తుల నుండి కాపాడుకోవడానికి మరో ఉద్యమం చేయాల్సి ఉందన్నారు. బిజెపి, మోడి మతత్వ విధానాల నుండి దేశాన్ని కాపాడుకోవాలని కోరారు. కార్యక్రమంలో అఖిల భారత విప్లవ రైతు సంఘం నాయకులు షేక్ మహమ్మద్ బాషా, రైతు సంఘం మండల కార్యదర్శి వీరవల్లి కృష్ణమూర్తి, రైతు సంఘం నాయకులు ఎనికపాటి రాంబాబు, బొడెంపూడి సూరిబాబు, గొట్టిపాటి శేషాద్రి, ఇందుర్తి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యుత్ కోతలతో ప్రజలకు కష్టాలు

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

విద్యుత్ అందించడంలో నిరంతరం శ్రమిస్తున్న విద్యుత్ ఉద్యోగుల సమస్యలు ప్రభుత్వం పట్టించుకోవడంలేదు. దీంతో విద్యుత్ ఉద్యోగులు సమ్మె బాట పట్టనున్నారు. ఈ నేపథ్యంలో మార్టూరు సబ్ డివిజన్‌లోని వివిధ గ్రామాల్లో మంగళవారం రాత్రి దాదాపు 5 గంటలు పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. చిన్నారులు, మహిళల అవస్థలు వర్ణనాతీతంగా ఉన్నాయి. మండల కేంద్రంమైన మార్టూరులో మాత్రం విద్యుత్ ఇచ్చి గ్రామాల్లో నిలిపివేయడంతో పలువురు ఆందోళనకు గురయ్యారు. గ్రామాల్లో ప్రజలు తమకు తెలిసిన వారిని ఫోన్లలో సమాచారం తెలుసుకునే ప్రయత్నం చేశారు. దీనిపై విద్యుత్ అధికారులను ప్రజాశక్తి వివరణ కోరగా జనరేషన్ స్టేషన్‌లపై ఒత్తిడి కలగకుండా లోడ్ రిలీఫ్ కోసం ఏపీ ట్రాన్స్ కో ఆదేశాల మేరకు పై స్థాయిలో విద్యుత్ సరఫరా నిలిపేశారని తెలిపారు.

నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న షేక్ జిలాని

ఉన్మాదుల నుంచి దేశాన్ని కాపాడాలి

ప్రజాశక్తి - చీరాల

మతోన్మాద శక్తుల నుండి దేశాన్ని కాపాడాలని దళిత బహుజన పార్టీ బాపట్ల జిల్లా అధ్యక్షులు షేక్ జిలాని కోరారు. దేశంలో మైనారిటీలు, దళిత, గిరిజనులపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ పేరాలలో నిరసన ప్రదర్శన చేపట్టారు. దేశంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి మతం పేరుతో దాడులు పెరిగిపోయాయని ఆరోపించారు. మణిపూర్ దారుణాలు మరవకముందే హర్యానాలో దళితులు, చర్చిలపై దాడులు చేస్తుంటే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఏమాత్రం స్పందించడంలేదని అన్నారు. అధికార బీజేపీ అండతో మతోన్మాద శక్తులు దాడులు చేస్తున్నాయని ఆరోపించారు. వీటిపై ప్రజలందరు తిరుగుబాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమరంలో జిలాని, బుజ్జి, ఇమ్రాన్, అమీర్, యాసీన్, అహ్మద్ పాల్గొన్నారు.

ఇంగ్లీష్ తరగతులు

ప్రజాశక్తి - బాపట్ల

ఇంగ్లీషులో చక్కగా మాట్లాడేందుకు, బోధించుటకు గృహిణులకు, మహిళా ఉపాధ్యాయులకు శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు విశ్రాంత ప్రిన్సిపాల్, ఆంగ్ల అధ్యాపకురాలు జి సంతోషమ్మ తెలిపారు. నూతన జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా, విద్యా ప్రమాణాలు పెంపొందించుటకు ఈ తరగతులు దోహద పడతాయని తెలిపారు. ఈ నెల 17 నుండి సూర్యలంక రోడ్ లోని భవిష్య కిడ్స్ పాఠశాల (పాత సాధనా స్కూల్) ఆవరణలో సాయంత్రం వేళల్లో నిర్వహిస్తామని తెలిపారు. మరిన్ని వివరాలకు 8309875369 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ప్రమాణం చేస్తున్న నూతన కార్యవర్గం

ప్రజలు చైతన్యవంతులు కావాలి : జెవివి

ప్రజాశక్తి-చీమకుర్తి

యుటిఎఫ్ కార్యాలయంలో జెవివి మండల సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సమావేశానికి జెవివి అధ్యక్షుడు పివికోటేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జెవివి జిల్లా గౌరవాధ్యక్షుడు డాక్టర్ బి. జవహర్ మాట్లాడుతూ ప్రజలలో ప్రభలుతున్న ఛాందస్త భావాలను పోగొట్టి,వారిలో శాస్త్రీయ భావాలు పెంపొందించే భాధ్యత జెవివి లాంటి సైన్స్ సంస్థలపై ఉందన్నారు. అనంతనం జెవివి మండల కమిటీని ఎన్ను కున్నారు. మండల అధ్యక్ష కార్యదర్శులుగా నల్లూరి వెంకటేశ్వరరావు, చలువాది రమేష్, కోశాధికారిగా వి. ఆంజనేయులు, గౌరవాధ్యక్షుడిగా ఎ.వీరారెడ్డి ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో జెవివి రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.సుబ్బ సుబ్రహ్మవ ణ్యాచారి, నాయకులు హరిప్రసాద రావు, ఎస్కె.శిర్, వెంకటేశ్వర్లు, పూసపాటి వెంకటరావు, పి. ఆంజనేయులు, ఎస్కె. అక్బర్, చలువాది శ్రీనివాసరావు, కోదాటి ఆంజనేయులు, స.వెంకట్, పి. భాస్కర్,పి. రమేష్, చాట్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పాఠశాలల్లో తనిఖీ

ప్రజాశక్తి-కొత్తపట్నం

మండల పరిధిలోని ప్రభుత్వ. ప్రైవేటు పాఠశాలలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి బుధవారం ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు తొలుత, కేజీబీవీ అంగన్వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. అనంతరం కొత్తపట్నం జిల్లా పరిషత్ హై స్కూల్‌ను పరిశీలించారు. స్కూల్ పరిసరాలు. పరిశుభ్రత పై అసహనం వ్యక్తం చేశారు మధ్యాహ్న భోజన పథకం తయారు చేసే వంటశాల బాగాలేదని అక్కడ ఉన్న కోడిగుడ్లపై ఈగలు వాలడాన్ని ఆమె గమనించారు. పాఠశాలలో 1500 మందికి గాను, 400 మంది విద్యార్థులు భోజనం చేయాల్సి ఉండగా కేవలం 302 గుడ్లు మాత్రమే ఉండటం ఏమిటని ఆమె ప్రశ్నించారు. అనంతరం అల్లూరులోని 11 నంబర్ అంగన్వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. కొత్తపట్నం లోని శ్రీవాణి విద్యానికేతన్ హై స్కూల్‌ను సందర్శించి విద్యార్థులను అడిగి పాఠశాలలోని మౌలిక వసతులను గురించి తెలుసుకున్నారు. పాఠశాల ఆవరణలో ఫిర్యాదుల పెట్టెను లేకపోవడం గమనించి యాజమాన్యంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యురాలు డి. నీలిమ, డిసిపి యూనిట్ కౌన్సిలర్ అనిత, విశ్వ మానవ సంక్షేమ సంఘం వ్యవస్థాపకులు పి మస్తాన్ రావు, ఎంఇఒ-1 తులసి కుమారి పాల్గొన్నారు.

అడవి బిడ్డలకు అండగా ఉంటాం

మంత్రి ఆదిమూలపు సురేష్

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

నల్లమల అటవీ ప్రాంతంలోని అడవి బిడ్డలకు అండగా ఉంటామని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ తెలిపారు. ఐటిడిఎ పిఒ డాక్టర్ బి. రవీంద్రారెడ్డి ఆధ్వర్యంలో స్థానిక బొగ్గరపు సత్యమమ్మ కళ్యాణ మండపంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సురేష్ మాట్లాడుతూ చెంచు గిరిజన గూడేల్లో రహదారులు, విద్యుత్ సౌకర్యం, విద్యా, వైద్యం అందుబాటులోకి తెస్తామన్నారు. దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో చెంచు గిరిజనులందరికీ ఇంటి పట్టాలు మంజూరు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. జగన్మోహన్‌రెడ్డి కూడా ఇళ్ల పట్టాలతో పాటు అటవీ హక్కుల చట్టం ద్వారా అటవీ భూములు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఒక్కొక్క గిరిజనుడికి రూ. 13,500 చొప్పున రైతు భరోసా డబ్బులు ప్రభుత్వం అందజేస్తుందన్నారు. 1,334 మంది గిరిజన రైతులకు రూ. 10 లక్షల మేర భరోసా నిధులు పంపిణీ చేసినట్లు తెలిపారు. 69 ఎకరాల్లో ఇళ్ల పట్టాలు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. నవరత్నాల్లో భాగంగా చేయూత, పింఛన్లు, రైతు భరోసా తదితర సంక్షేమ పథకాలు అంద జేస్తున్నట్లు తెలిపారు. అడవి తల్లిని నమ్ముకొని జీవిస్తున్న గిరిజనులకు చదువు, వైద్యం, వ్యవ సాయం చేసుకునేందుకు అన్ని సౌకర్యాలు కల్పించనున్నట్లు తెలిపారు. గిరిజనులకు ప్రత్యేకంగా ఉపాధి పని దినాలను 150 రోజులకు పెంచినట్లు చెప్పారు. అవసరమైన చోట్ల సోలార్ ట్యాంకులను, అవకాశం ఉన్నచోట త్రిఫేజ్ కరెంటును ఏర్పాటు చేస్తామన్నారు. చెంచు గిరిజనుల కోసం దోర్నాల సమీపంలో రూ. 50 కోట్లతో సూపర్ స్పెషాలిటీ వైద్యశాల నిర్మాణం జరుగు తుందన్నారు. అనంతరం రూ. 1.50 లక్షలు విలువ కలిగిన తొమ్మిది మోటర్లను గిరిజనులకు పంపిణీ చేశారు. అటవీ హక్కుల చట్టం ద్వారా మంజూరైన పట్టాదారు పాస్ పుస్తకాలను గిరిజనులకు అందజేశారు.

మాట్లాడుతున్న మంత్రి సురేష్

తొలుత చెంచు గిరిజనులు ప్రదర్శించిన నృత్య రూపాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఐటిడిఎ పిఒ డాక్టర్ రవీంద్రారెడ్డి, ఆర్‌డిటి డైరెక్టర్ పుష్పలత, దోర్నాల మేజర్ పంచాయతీ సర్పంచి చిత్తూరి హారిక, మాచర్ల జడ్‌పిటిసి మల్లు స్వామి, ఎఎంసి చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, మాజీ జడ్‌పిటిసి అమ్మిరెడ్డి రామిరెడ్డి, విఆర్‌ఒ సంస్థ చైర్మన్ నరసింహారెడ్డి, వీట్ సంస్థ చైర్మన్ సత్యగోపాల్‌రెడ్డి, ఎంపిడిఒ విజయ, తహశీల్దారు వేణుగోపాల్, నాయకులు గుమ్మా యల్లేష్, వెన్నా కాశిరెడ్డి, మూగన్న, మంతన్న, గిరిజన సర్పంచులు విటిడిఎ ప్రెసిడెంట్లు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

అదనపు ఆహార ధాన్యాలపై మాగుంట ప్రశ్న

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

రాష్ట్రంలో పెరిగిన డిమాండ్ తీర్చడానికి అదనపు ఆహార ధాన్యాల కేటాయింపుపై కేంద్ర చర్యలపై ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి ప్రశ్నించారు. ఈ ప్రశ్నకు కేంద్ర గ్రామీణాభివద్ధి, వినియోగదారుల వ్యవహారాల, ఆహార మరియు ప్రజా పంపిణీ శాఖ సహాయక మంత్రి సాధ్వి నిరంజన్ జ్యోతి గారు సమాదానమిస్తూ నేషనల్ ఫుడ్ సెక్యూరిటీ ఆక్ట్ 2013లో రాష్ట్రాలు పంపిన లబ్ధిదారుల గుర్తింపు నివేదికల ఆధారంగా దేశంలో రాష్ట్రాలకు ఆహార ధాన్యాల కేటాయింపు అనేది గహ వినియోగ వ్యయ సర్వే ((2011-12), ఆహార అర్హతను బట్టి అంత్యోదయ అన్నా యోజన పథకంలో నెలకు ఒకరికి 5 కేజీలు చొప్పున ఒక కుటుంబానికి 35 కేజీలు ఇస్తున్నట్లు తెలిపారు. నేషనల్ ఫుడ్ సెక్యూరిటీ ఆక్ట్ ప్రకారం, అంధప్రదేశ్ రాష్ట్రానికి 268.23 లక్షల మంది లబ్ధిదారులను నిర్ణయించి రాష్ట్రాలు పంపే నివేదికల ప్రకారం లబ్ధిదారుల సంఖ్య అనేది పలు కారణాలతో తగ్గడం లేదా పెంచనున్నట్లు తెలిపారు. దాని ప్రకారంం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి నెలకు 1,55,987 మెట్రిక్ టన్నుల ఆహార ధాన్యాలు చట్టం పరిధిలో గరిష్టంగా కేటాయిస్తున్నామన్నారు. . ప్రధాన్ మంత్రి గరీబ్ కళ్యాన్ అన్న యోజన పథకంలో 2023 జనవరి నుంచి అన్ని రాష్ట్రాలకు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు.

రక్తదాన శిబిరం

ప్రజాశక్తి -చీమకుర్తి

సూపర్‌స్టార్ మహేష్‌బాబు 48వ పుట్టినరోజు సందర్భంగా మండల పరిధిలోని పి.నాయుడుపాలెంలో ఆర్‌డిఎఫ్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహేష్‌బాబు సేవా అసోసియేషన్ అధ్యక్షుడు టి. తిరుపతిరావు మాట్లాడుతూ మహేష్‌బాబు ఇప్పటికే 3వేల మంది చిన్నారులకు ఉచితంగా గుండె ఆపరేషన్లు చేయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఎఫ్ అధ్యక్షుడు ఇస్తర్ల శంకర్, నియోజకవర్గ కన్వీనర్ టి. వెంకటరాజా, అసోసియేషన్ సభ్యులు అంజయ్య, రమణయ్య, కోటేష్, శివనాగరాజు, శ్రీను, పాల్గొన్నారు.